మార్చి 2019
రూ. 20

# చైతన్యం

**సంకల్ప బలం**

## సామాజిక విలువల మాసపత్రిక



# అమరులకు శ్రద్ధాంజలి



అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రధాని



పాఠకులకు
హోలీ
శుభాకాంక్షలు




# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

వ్యవస్థాపక సంపాదకురాలు

తీగవరపు శాంతి

సంపుటి -8 మార్చి 2019 సంచిక -6


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| మానసరోవర యాత్ర | 6 |
| ప్రేమంటే ఇంతే | 14 |
| ముల్లా నస్రుద్దీన్ కథలు | 16 |
| కాశీ ఖండం | 23 |
| వానమామలై....... | 24 |
| సంభాషణ సంస్కృతం | 28 |
| మా ఊరి నందుల కథ | 34 |
| ప్రహేళిక | 40 |
| రాశి ఫలాలు | 48 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| అనిర్ధారిత సూత్రం | 10 |
| సుధా మూర్తి | 18 |
| టి వి నటి, యాంకర్ భానుశ్రీ | 21 |
| ఎన్నికలకు యుక్తులు | 22 |
| పసిడి మనసులు | 32 |
| కలికాలం ముచ్చట్లు | 33 |
| గమ్యం | 35 |
| నవవసంతానికి నాంది ఫాల్గుణ మాసం | 41 |
| జైహింద్ | 45 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# భారత సైన్యానికి శాల్యూట్.

-

హిమాలయాలకే మణి భాగమైన కా శ్మీర్ ఈ రోజు రక్తపాతంలో మునిగిపోయింది. అసలు జమ్మూ కాశ్మీర్ మూడు భాగాలుగా మారింది. జమ్మూ , కాశ్మీర్ మన అధీనంలో ఉంటే, మరొక కొంత భాగం పాకి-స్థాన్ లో ఉంది. మన కాశ్మీర్ పాకిస్తాన్ ఆక్రమించడంతో, ఇరు దేశాల మధ్య యుద్ధం నడుస్తూనే ఉంది. ఎప్పటికప్పుడు యుద్ధానికి కాలుదువ్వడం, రణరంగంలో ఓడిపోయి, వెనుతిరగడం పాకిస్థాన్ కి కొత్తేమీ కాదు. ఈ యుద్ధం వల్ల ముఖ్యంగా ఇరు దేశాల సైనికులు నష్టపోవడం ఎంతో బాధాకరం. ఎన్నో దశాబ్దా-లుగా జరుగుతున్న ఈ యుద్ధాలకి స్వస్థి పలికేదెప్పుడా! అని ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పాకిస్థాన్ శాంతి చర్చలు జరుపుదామంటూనే, రక రకాలుగా యుద్ధాలు చేస్తూనే ఉంది. భారత్ తో పాటు ప్రపంచదేశాలన్నీ విసిగిపోయి, పాకిస్తాన్ ని ఏకాకిని చేసాయి. దేశాన్ని కాపాడవలసిన అత్యంత కీలకమైన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఇక్కడ మన భారత దేశ సైనికులు ఎంతో ధైర్య సాహసాలతో, ఎంతో తెలివిగా వారు యుద్ధంలో పాల్గొనడం నిజంగా గర్వించతగ్గ విషయం. పుల్వామాలో జరిగిన దాడిలో ఫిబ్రవరి 14న, 40 మందికి పైగా మనం వీర జవాన్లను కోల్పోవడం జరిగింది. సెలవు దొరికి ఎప్పుడెప్పుడువాళ్ళు వస్తారా? అని ఎదురు చూసే ఆ కుటుంబాల పరిస్థితి తలచుకుంటేనే గుండె గుభేలుమంటుంది. దాంతో రెచ్చి పోయిన మన సైనికులు పాకిస్థాన్ స్థావరాలపై దాడులు జరిపి, అక్కడ 300 మంది సైనికులను మట్టుపెట్టారు ఆ సమయంలో మన పైలట్ అభినందన్ పట్టుబడ్డాడు.

శత్రువుల చేతుల్లో చిక్కుకున్నా, ఏమాత్రం బెదరక, కళ్ళల్లో కళ్ళు పెట్టి, వారడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఏమి చెప్పచ్చో అవి మాత్రమే చెప్పి, మన దేశ రహస్యాలను చెప్పకూడదు అని నిర్మొహమా-టంగా , ధైర్యంగా చెప్పిన ధీరుడు, శూరుడు. ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించిన అభినందన్ కుటుం_బానికే కాక దేశ చరిత్రలోనే తన పేరు స్థిరంగా నిలుపుకున్న వీరాధి వీరుడు అని చెప్పక తప్పదు. మార్చి 2వ తేదీన 130 కోట్ల ప్రజానీకం తో పాటు యావత్ ప్రపంచం లోని ప్రజానీకం అభినందన్ రాకకై ఎదురు చూస్తూ, అభినందన్ కి స్వాగతం పలుకుతూ పెద్ద పండుగలా జరుపుకున్నారు. అక్కడ దశాబ్దాలుగా పో-రాడుతున్న శత్రువులు, అభినందన్ ద్వారా వీలైనన్ని రహస్యాలను రాబట్టడానికి చేసే ప్రయత్నాలలో మన దేశాన్ని కాపాడడానికి సరియైన సమాధానాలు రాబట్ట లేకపోవడంతో, మానసికంగా హింస పెట్టారు అని అభినందన్ ద్వారా వింటుంటే, అభినందన్ పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు.

ఇంక అయిపోయింది అనుకోవడానికి లేదు. ఓ ప్రక్క అభినందన్ ని ఇండియాకి పంపుతూ, శాంతి కోసమే అంటూనే, మరో పక్క యుద్ధం చేయడం పాకిస్తాన్ చేసే కుట్రగా చెప్పవచ్చు యుద్ధాలలో చనిపోయే సైనికులను, వారి కుటుంబాలను తలచుకుంటే వారి జీవితాలు అత్యంత బాధాకరం.

ఏదేశ ప్రజలు చనిపోయినా బాధాకరమే. ఉగ్రవాదానికే స్వస్తి పలికి, ప్రపంచం లోని ప్రజలందరూ శాంతి యుత జీవనం గడపాలి. ఇక పొతే దేశ రాజకీయాల గురించి కూడా ఇదే సమయం అనుకుని ప్రస్తావిస్తున్న పార్టీలను ప్రజలు క్షమించరని తెలుసుకోవాలి. దేశ భద్రత విషయంలో ఎవరైనా చిన్న పొరపాటు చేసినా ప్రజలు ఊరుకోరు. మనలో మనం తన్నుకున్నా, దేశ భద్రత విషయంలో ప్రజలు చాలా అప్రమత్తంగా ఉం-టారనడం నిస్సందేహం. యుద్ధ సమయంలో పార్టీలన్నీ ఏకమవ్వడం గర్వించదగ్గ విషయం.

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

టైటిల్ పేజి తో పాటు కవర్ పేజీలన్నీ చాలా బావున్నాయి. ముక్తినాథ్ యాత్ర గురించి బాగా వ్రాస్తున్నారు. వీడియో కూడా మాకు దగ్గరుండి మీరు చూపిస్తున్నారా! అన్నంత బావుంటోంది. వేమూరి వెంకటేశ్వరరావు గారు ఊహించని విధంగా తెలియని కొత్త కొత్త విషయాలు వ్రాస్తు-న్నారు.

**శ్రీమతి శాంతి సాగర్. శ్రీమతి శేషు, శ్రీమతి నాగ లక్ష్మి శ్రీమతి విజయ లక్ష్మి , శ్రీ డి. ఎస్. ఆర్ .మూర్తి ., శ్రీ డి ఎస్ . ఆర్ . శాస్త్రి ---- అత్తాపూర్ , జనప్రియ. శ్రీమతి అనురాధ --- కొండాపూర్ .**

శ్రీ ఇంద్రగంటి సుబ్బారావు " ప్రేమంటే ఇంతే " ఆఫీస్ ఒకపక్క, మరో పక్క పెళ్లి హడావిడి కథ బాగా తీసుకు వస్తున్నారు. పాలెపు బుచ్చి రాజు గారు వ్రాసిన ఖరీదైన తలపాగా కుడా చాలా బావుంది.

**శ్రీ కనకా రావు, శ్రీమతి అపర్ణ ---- ఏలూరు. శ్రీ కోటేశ్వరరావు , శ్రీ పురుషోత్తం , శ్రీమతి గీత --- వరంగల్.**

శ్రీ కోడి రామమూర్తి గారి బలం గురించి శ్రీ పోడూరి శ్రీనివాస రావు గారు బాగా వివరించారు. వేదుల సుబ్రహ్మణ్యం గారు ఎన్నికల గురించి సమాజానికి అద్దం పట్టినట్లు గా వ్రాస్తున్నారు.

**శ్రీ రంగా రావు. శ్రీమతి అరుణ .----- ఆదిలా-బాదు . శ్రీమతి మంజుల , శ్రీమతి కల్పన, శ్రీ సుధాకర్ --- ఢిల్లీ.**

పోచినపెద్ది మురళీ కృష్ణ గారు వ్రాస్తున్న " కాశీ ఖండం" చాలా బావుంటోంది. తుమ్మూరి రామ-మోహనరావు గారు" తెలంగాణా మహాను భావులు " అందులో భాగంగా "జగన్నాధాచార్యులు " వారి గురించి వివరంగా వ్రాస్తున్నారు. తెలంగాణా మహానుభావుల గురించి విషయాలన్నీ ఆసక్తి కరంగా ఉంటున్నాయి.

**శ్రీమతి రాధా రమణి. శ్రీమతి సుధ, శ్రీ కృష్ణ మూర్తి ---- సిద్ధిపేట . శ్రీమతి సుందరి, శ్రీమతి పల్లవి ---- కర్నూల్.**

శ్రీ దుర్గా ప్రసాద్ గారు సంస్కృత పాఠాలు వివరంగా, సులువుగా నేర్పిస్తున్నారు. ఆదూరి హైమవతి గారు పిల్లలకి ఉపయోగకరంగా కథలు వ్రాస్తున్నారు.

**శ్రీమతి కనక దుర్గ., శ్రీ శ్రీరామ చంద్ర రావు . ---- నెల్లూరు . శ్రీ ప్రభాకరం, శ్రీమతి లక్ష్మి ---- బెంగళూరు.**

శ్రీ నందుల ప్రభాకర శాస్త్రి అక్కడ వ్యవసాయ వృత్తే అందరిదీ అంటూ కథ బాగా తీసుకొస్తు-న్నారు. ఎలక్ట్రాన్ గారు వ్రాసిన గ్రహణం పట్టిన మనిషి బావుంది. జరుగుతున్నవిషయాలను అద్దం పట్టినట్లు చూపించారు .

**శ్రీమతి చంటి , శ్రీమతి ఇందిర, శ్రీ మోహన రావు --- విజయ వాడ. శ్రీమతి స్వాతి, శ్రీ వే-ణుగోపాల్, శ్రీ రంగా రావు ------------ హైదరా-బాదు.**

శ్రీ భువన చంద్ర వ్రాసే పోటీ కథ ఎంతో జ్ఞాన బోధ చేస్తున్నట్లుగా ఉంటుంది. మనస్సుకి హత్తుకునేటటుగా ఉంటుంది. ఈ కథ ఎంతో అద్భుతంగా ఉంది. ప్రహేళిక చేద్దాము అని చూస్తున్నాను, కానీ ఇంకా చెయ్యలేక పోతు-న్నాను.

**శ్రీమతి నాగ లక్ష్మి , శ్రీమతి వనజ , శ్రీ ప్ర-భాకర రావు ---- హైదరాబాదు . శ్రీ సురేష్ , శ్రీ వెంకట్రావు, శ్రీమతి సుధ --- గొల్లపల్లి .**

కొత్త రామానందం గారు మాఘమాసం గురించి తెలియనివి మాకు చెప్పడమేకాక , ఆచరించే విధానం గురించి కూడా వ్రాస్తున్నారు. మేము ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాము . రాశి ఫలాలు చూసుకోనిదే ఆగలేము. ముందు మా జాతకం చేసుకుంటాము. డా.హనుమంత రావు గారికి అభినందనలు వి వి ఎస్ శర్మ గారిని చూపించి, వారి గురించి వ్రాసినందుకు. వారిని చూసి ఎంతో ఆనందం కలిగింది.

శ్రీ ప్రకాశ రావు, శ్రీ సుబ్బా రాయుడు, శ్రీ మల్లి ఖార్జున రావు ---- ఖమ్మం . శ్రీమతి జయ, శ్రీమతి రాధ ------ కడప

# కల నిజమాయె -
# మానస సరోవర యాత్ర

గండకి చక్కని భోజనం పెటింది. పుచ్చిన చేతి వ్రేళ్ళతో అతను తినలేకపోతే, పుచ్చిన చేతి వ్రేళ్ళు ఊడిపోతే, అవి పక్కన పెట్టి భోజనం తినిపించింది. పక్క మీదకు చేర్చింది. విసురుతూ కూర్చుంది. జ్వరంతో అతను ప్రాణాలు వదిలాడు. అప్పటి ఆచారం ప్రకారం సహగమనానికి పూనుకుంది. తల్లీ, బంధువులూ తల్లడిల్లినా ఆగలేదు. తాళికట్టిన భార్యలా తల్లడిల్లిపోయింది. ఉన్న ధనమంతా బీద సాదలకు పంచేసింది. దాన ధర్మాలు చేసి శవం వెంట మేళ తాళాలతో వెళ్లి తానే చితి పేర్చి, నిప్పంటించింది. తానూ చితిలోకి దూకి సహగమనం చేసింది. చిత్రంగా పైకెగసిన మంటలు మల్లెలయ్యాయి. కట్టెలు పువ్వులయ్యాయి.

లక్ష్మి సమేతంగా విష్ణుమూర్తి ప్రత్యక్షమయ్యాడు. వారి దర్శన భాగ్యం పొందిన గండకి కన్నీళ్లతో కీర్తిస్తూ, ఆ కన్నీళ్లతో కాళ్ళు కడిగి మనస్సు, శరీరము స్వచ్ఛందంగా నిలిపింది. గండకీ పవిత్రతకు నారాయణుడు పరవశించిపోయారు. నియమ నిబంధనలకు నిర్ఘాంత పోయాడు. ఆమె నిశ్చలతకు చలించి పోయాడు. ఏమి వరం కావాలో కోరుకోమన్నాడు. మాతృత్వం వరంగా కావాలని, విష్ణుమూర్తిని తన కొడుకుగా పుట్టాలని కోరింది. విష్ణుమూర్తి అందుకు సమ్మతించి, గండకి నదిగా పుడుతుందని, తను సాలిగ్రామమై ఆ నది ఒడిలోనే ఎప్పుడూ ఉంటానని వరమిచ్చాడు. ఆ వర ప్రభావంతో మరుసటి జన్మలో గండకీ నదిగా పుట్టింది. ఆ నది కడుపులో కొడుకుగా పుట్టి సాలి గ్రామ రూపంలో విష్ణుమూర్తి పూజలందుకుంటున్నాడు.

గండకీ ఏ కులంలో పుట్టినా, ఎలాంటి పరిస్థితులలో ఉన్నా, మనస్సు మలినం కాలేదు. ఆవిధంగా పవిత్రురాలై కృత యుగంలో ఇది జరిగినా, ఈ యుగానికీ గండకీ కథ నిలిచిపోయింది. ఈ కథను విని అక్కడ కొన్ని సాలిగ్రామాలు ఏరుకుని, అక్కడ గండకీ నదిలోని నీళ్లు జల్లుకుని, మరల బయలు దేరాం.

అలాగే ఈ నది ఒడ్డునే, మనం ఎంతో భక్తి శ్రద్ధలతో కొలిచే సాక్షాత్తు ఆది పరాశక్తి శరీరంలోని భాగమైన "కుడి దవడ" ఇక్కడ పడింది అని చెపుతాయి మన పు రా ణా లు .

అయితే సతీ దేవి శరీర భాగాలు ఇక్కడ పడడం వెనుక ఒక విషాద గాధ ఒకటి ఉంది.

ఈ శక్తీ పీఠాలు భారతదేశంతో సహా శ్రీలంక, పాకిస్తాన్, నేపాల్ వంటి పొరుగు దేశాలలో కూడా ఉన్నాయి. ముఖ్యంగా సతీ దేవి శక్తి పీఠాలు 18 అని, వాటిని అష్టాదశ శక్తి పీఠాలు అంటారని మన పురాణాలు చెపుతున్నాయి. ఆది శంకరాచార్యుల వారు రచించిన శ్లోకం ఆధారంగా చూస్తే, శక్తి పీఠాలు 18 మాత్రమే ఉన్నాయి అని తెలుస్తోంది. అయితే ఈ శక్తి పీఠాలు 51 అని, మరి కొందరి ప్రకారం 108 అని వాదన కుడా వినిపిస్తుంది. అంతటా వ్యాపించి ఉన్న ఈ శక్తి పీఠాల గాథ తెలుసుకుందాము.

బ్రహ్మ దేవుని కుమారులలో ఒకరైన దక్ష ప్రజా పతికి 53 మంది కుమార్తెలు ఉండేవారు. అందులో 27 మందిని చంద్రుడికి, 13 మందిని కశ్యప మహర్షికి, 10 మందిని ధర్మునికి ఒకామెను పితరునికి, ఒకామెను అగ్నికి ఇచ్చి వివాహం చేసాడు. మిగిలిన కూతురే సతీ దేవి. ఆ సతీ దేవే ఆది పరాశక్తి అంశ. సతీదేవికి

చిన్నప్పటి నుండీ శివుడు అంటే మక్కువ. అందుచేత ఆమెను చంద్రునికిచ్చి పెండ్లి చేయలేదు. ఇదిలా ఉండగా ఒకరోజు చంద్రుని భార్యలలో 26 మంది తమ తండ్రి దక్షుడి వద్దకు వచ్చి తమ భర్త చంద్రుడు రోహిణిని తప్ప మమ్మల్ని పట్టించుకోవడం లేదు అని మొర పెట్టుకోవడంతో దక్షుడు చంద్రుణ్ణి పిలిచి మందలించాడు. అయినా చంద్రుడు అదే పని చేయడంతో దక్షుడికి కోపం వచ్చి చంద్రుణ్ణి కురూపిగా మారమని శపించాడు. ఆ తరువాత నారదుడి సలహా మేరకు చంద్రుడు శివుణ్ణి ప్రార్థించి, అ శాపానికి ఉపశమనం అడుగగా, శివుడు ఆ శాపం నుండి పాక్షిక విమోచనం కలగా జేశాడు. ఇది తెలుసుకున్న దక్షుడు శివునిపై అక్కసు పెంచుకుని, సతీదేవిని ఈశ్వరుని కిచ్చి వివాహం చేయడానికి సమ్మతించలేదు. అయినా తండ్రి అభీష్టానికి విరుద్ధంగా సతీదేవి శివుణ్ణి పెళ్ళాడడంతో దక్షుడు పరమేశ్వరునిపై మరింత కోపోద్రిక్తుడయ్యాడు. ఇదిలా ఉండగా బృహస్పతి ఒకనాడు బ్రహ్మ తల బెట్టిన యాగానికి సకల దేవతలు విచ్చేయగా ఆఖరున దక్షుడు వచ్చాడు. అతనిని చూచి త్రిమూర్తులు తప్ప, మిగిలిన వారంతా గౌరవ భావంతో లేచి నిలబడ్డారు. అంతట దక్షుడు బ్రహ్మ నాకు తండ్రి. విష్ణువు నాకు తాత వరుస. మరి! మామగారు వచ్చినప్పుడు లేచి నిలబడకుండా నన్ను అవమానిస్తావా? అంటూ దూషించాడు. దాంతో దక్షుడు కోపోద్రిక్తుడై శివ రహిత మహాయాగాన్ని నేను నిర్వహిస్తానని అక్కడనుండి వెళ్లి పోయాడు.

ఆ తరువాత బృహస్పతి సహాయంతో దక్ష యజ్ఞాన్ని ప్రారంభించి, దానికి సమస్త లోకంలోని దేవ, దానవ, కిన్నెర, కింపురుషాదులందరికీ ఆహ్వానం పంపి, ఒక్క శివుని మాత్రం పిలవలేదు. శివుడు లేని ఆ యాగానికి రామని చెప్పి బ్రహ్మ, విష్ణువు వెళ్ళలేదు. అయితే తన తండ్రి చేసే ఆ యాగానికి శివుడు వద్దని వారించినా, వినకుండా దాక్షాయణి వెళ్ళింది.

అక్కడ దక్షుడు శివుణ్ణి, సతిని సమస్త జనులముందు ఘోరంగా అవమానించగా దానికి కోపం వచ్చిన సతీదేవి, యాగాగ్నిలో దూకి, ఆత్మాహుతి చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న రుద్రుడు తన సమస్త గణాలను పంపగా, వారు దక్ష యజ్ఞాన్ని నాశనం చేసి, వారు దక్షుణ్ణి సంహరించారు. ఆ తరువాత తల్లి సతీ దేవి శరీరాన్ని రుద్రుడు తీసుకువెడుతున్న సమయంలో, ఆ తల్లి శరీర భాగాలు పడ్డ చోట శక్తి పీఠాలుగా వెలిశాయని చెబుతూ ఉంటారు. అలా దర్శనం కలిగే భాగ్యం నేపాల్ లో కూడా ఉంది. అదీ ఆ గండకీ నది ఒడ్డునే ఉందిట. కానీ మాకు తెలియ లేదు. గైడ్ కూడా చెప్పలేదు. మేము మిస్ అయ్యినట్లే మీరు కూడా మిస్ అవకూడదని చెబుతున్నాను.

అక్కడ సతీదేవి కుడి కణత పడి శక్తి పీఠంగా మారింది అని, అక్కడికి వెళ్లివచ్చాక మాకు తెలిసింది. ఆ విధంగా అమ్మవారిని అందరం తల్చుకుని తరిద్దాము. తరువాత మేము జీప్ ఎక్కి, కొండా కోనలు చూసుకుంటూ బయలుదేరాము. హోటల్ కి ఒక 1/2 కిమీ దూరంలో జీప్ ఆపి నడిచి హోటల్ కి వెళ్ళమన్నాడు. సామాన్లు జీప్ లో తీసుకు వస్తాను అని చెప్పాడు. అక్కడ గుర్రాల వాళ్లకి బతుకు తెరువు కోసం నడవమంటారు. నడవలేని వాళ్ళు గుఱ్ఱం ఎక్కుతారని .

మా సామాన్లు అక్కడే హోటల్ లో పెట్టి, అప్పుడు సాయంత్రం అయినా ఎండగా ఉంది ఇంకా. అందుకే స్నానం చేద్దాము పైన, రేపు మళ్ళీ వాతావరణం ఎలా ఉంటుందో తెలియదు అని మార్చుకునే బట్టలు తీసుకుని వెళ్ళాము చాలా ఎక్కువ దూరము లేదు. అంటే నడుచుకుంటూ వెళ్ళాము. అదొక అద్భుత వరం. అక్కడకి జేరగల్గడం భగవంతుడు మాకు ప్రసాదించిన అదృష్టం. ముక్తినా గురించి కొద్దిగా తెలుసుకుందాము. మీరు కుడా ఆ

అదృష్టాన్ని పొందండి.

ఈ ముక్తినాధ్ నేపాల్ దేశంలోని మాసక్ జిల్లాలోని హిమాలయ పర్వతంలో భాగమై ఉన్న రాణీ పౌవా అనే గ్రామానికి దగ్గరలో ఉంది. అలాగే తొరంగాలా అనే పర్వత పాదం వద్ద ఉంది ఈ క్షేత్రం. ఇది హిందువులకు పవిత్ర క్షేత్రం. 108 దివ్య క్షేత్రాలలో ముక్తినాధ్ ఒకటి. 8 విష్ణు క్షేత్రాలలో ఈ ముక్తినాధ్ ఒకటి. మరి మిగిలిన విష్ణు క్షేత్రాలు 1.బద్రీనాధ్, 2.నైమిశారణ్యం 3. తిరుమల 4.తోతాద్రి 5.శ్రీరంగం 6.వైకుంఠం 7.పుష్కర్. విష్ణు భగవానుని ఆలయాలలో ఇది చాలా పురాతనమైంది. 8 స్వయంభూ క్షేత్రాలలో ఒకటి. మహా విష్ణువు మూల మూర్తి. ఆలయ ప్రాకారంలో 108 నంది ముఖాల నుండి జలం ప్రవహిస్తూ ఉంటుంది. ఈ పవిత్ర జలాలు ఆలయ ప్రాంగణంలో ఉన్న పుష్కరిణి నుండి 108 పైపుల ద్వారా నంది ముఖాలలోకి ప్రవహింపజేస్తారు. 108 దివ్య క్షేత్రాల పుష్కరిణి జలాలకు ప్రతీకగా ఈ నంది ముఖాలనుండి వచ్చే జలాలుగా భావిస్తారు. అందుకే అంత చలిలో కూడా భక్తులు ఈ పవిత్ర జలాలలో పవిత్ర స్నానాలు చేస్తూ ఉంటారు. హిందువులకు ఇది ఎంతో పవిత్ర క్షేత్రం. ఈ రాణీ పౌవా క్షేత్రం ముక్తి క్షేత్రం అనీ ముక్తి నిచ్చే క్షేత్రం అని, మోక్షాన్నిచ్చే క్షేత్రం అనీ అంటారు. ఈ ఆలయం ఒకప్పుడు వైష్ణవుల అధీనంలో ఉండేది. తరువాత బుద్ధుల ఆరాధనా క్షేత్రంగా మారిందని భావిస్తారు.



గోముఖాల నుంచి వచ్చే 108 పవిత్ర ధారలు

పూర్వం ఈ ప్రదేశం సాలిగ్రామం అని పిలవబడుతూవుండేది. శ్రీమన్నారాయణకు ప్రతిరూపమైన సాలిగ్రామం లభించడమే ఇందుకు కారణం. ఈ ప్రదేశాన్ని చూమింగ్ గాస్తా అని పిలుస్తారు. అంటే నూరు జలాలని టిబెట్ భాషలో అర్ధం. అయితే టిబెటిని ఢాకినీ క్షేత్రంగా భావిస్తారు. ఢాకినీ అంటే ఆకాశంలో నృత్యదేవతగా అవతరించాడని వారు భావిస్తారు. టిబెట్ బుద్ధిజం స్థాపకుడు 'పద్మ సంభవ' టిబెట్టుకు వెళ్లే సమయంలో ఇక్కడ ధ్యానం చేసాడని బుద్ధ సాంప్రదాయాలు భావిస్తాయి. ఈ ఆలయాన్ని హిందూ పురాణాలు కూడా పలు మార్లు శ్లాఘించాయి. విష్ణు పురాణంలో గండకీ నది మహాత్యం లో ముక్తినాధ్ గురించి శ్లాఘించబడింది. ఈ 108 జలాల ముఖాల కింద స్నానం చేస్తే ముక్తి కలుగుతుందని నమ్ముతారు. భూమి మీద పంచ భూతాలు ఉన్న ఏకైక ప్రదేశం ఇదే అని భావిస్తారు.

అలాగే 108 గోముఖాల ద్వారా వచ్చే నీటితో స్నానం చేసాక అక్కడ ఆలయం ముందు రెండు కుండ్ లు ఉంటాయి (స్విమ్మింగ్ పూల్ లాగ) పాప్ కుండ్, పుణ్య కుండ్ అని. అలాగే 108 నంది ముఖాలద్వారా వచ్చే నీటితో స్నానం చేసాక ముందుగా పాప్ కుండ్ లో స్నానం చేస్తే, మన పాపాలు పోతాయి అనీ, తరువాత పుణ్యకుండ్ లో స్నానం చేస్తే పుణ్యం కుడా పోతుంది. అదేమిటని ఆశ్చర్య పడుతున్నారా? పాపం మిగిలి పోతే పాపం అనుభవించడానికి జన్మ ఎత్తాలి. అలాగే పుణ్యం మిగిలినా పుణ్య ఫలితాన్ని అనుభవించడానికి జన్మ ఎత్తాలి. కాబట్టి రెండు పోతే, అసలు జన్మ ఎత్తక్కర లేకుండా ముక్తి లభిస్తుంది. అందుకే ఇది ముక్తి నాద్ క్షేత్రం అయ్యింది.



శ్రీదేవి భూదేవి సమేత ముక్తినాధ స్వామి

అక్కడ బట్టలు మార్చుకునే సదుపాయం కూడా వుంది. మేం బట్టలు మార్చుకుని స్నానానికి ఉపక్రమించాం. నీళ్ళు ఎంత చల్లగా వున్నాయో చెప్పలేం. అలాగే ఊపిరి బిగబట్టి మొదటి గోముఖం ధార కింద స్నానం మొదలుపెట్టాం. ఒక్కసారి తడవగానే అలవాటయిపోయింది. చలి అనిపించలేదు. అలాగా ఆ 108 గోముఖాల నుంచి వచ్చే ధారలలో స్నానం చేసి, ఆ తర్వాత పాపకుండం లోను, ఆ తర్వాత పుణ్యకుండంలో కూడా మునిగి, ఆ తర్వాత బట్టలు మార్చుకుని ముక్తినాధ్ స్వామిని దర్శించుకున్నాం.ఆ ముక్తినాధ్ ఆలయంలో స్త్రీ టిబెట్ సన్యాసిని పూజారిగా ఉంటారు. ఆవిడే దేముడికి హారతి ఇచ్చి మాకు దేముడిని చూపించారు. అక్కడ దీపాలు వెలిగించుకుని, విష్ణు సహస్ర నామ పారాయణ చేసుకున్నాం.

కొండ మీద నుండి కిందకి వచ్చి, హోటల్ కి వెళ్లి కాఫీ తాగాం. కరంటు పోయింది. హోటల్ కి వచ్చేసరికి బానేఉంది. కానీ ఇప్పుడు లేదు. సరే అలాగే కబుర్లు చెప్పుకుంటూ విమల గారు మేము కొద్దీ సేపు గడిపాక, భోజనానికి ఆర్డర్ ఇమ్మని హోటల్ అబ్బాయి అడిగాడు. కరంటు రాదా? అంటే అనుమానమే. మీరు తినేసి వెళ్లి పడుకోండి పొద్దున్నే లేవచ్చు అన్నాడు. చీకటి మయం. బాగా చలిగా ఉంది. చిన్న కాండిల్ పెట్టాడు ఆ వెలుతురులోనే మేము ఆర్డర్ ఇస్తే, ఐటమ్స్ పట్టుకొచ్చాడు.

అందరూ తినడం స్టార్ట్ చేశారు. నేనూ తిందామని మొదలుపెట్టబోతూ, దేముడికి నైవేద్యం పెట్టుకుని తిందామంటే, అప్పుడు నేను పడిన బాధ వర్ణనా తీతం. కళ్ళనీళ్ళు ఆగడం లేదు. మా వారు చూసి, తిను అంటున్నారు. కానీ దుఖంతో గొంతు పూడుకు పోయి, కళ్ళ నీళ్ళు కారుతూనే ఉన్నాయి. మాతో వచ్చిన వాళ్ళు తినండి అన్నారు. తరువాత నన్ను చూసి, ఏమైంది? అన్నారు. నాకు చెప్పడానికి గొంతు రావడం లేదు తిండి తినలేక పోతున్నాను, ట్రై చేసినా, తినలేక పోయాను.

అప్పుడు మా వారు అన్నారు కదా! దేముడిని చీకట్లో వదిలేశానని బాధగా ఉందా? అన్నారు. అవును అని బుర్ర ఊపాను. ఈయన ఎలా కనిపెట్టారు? అని నాకు అర్థం కాలేదు. తరువాత ఎలా తెలిసింది? అంటే ఏమో అనిపించింది అన్నారు. 'నన్ను ఇక్కడ కొండల్లో చీకట్లో వదిలేసి మీరు వెళ్ళిపోతున్నారా' అని కరుణగా స్వామి మమ్మల్ని అడుగుతున్నట్టు మాకు అనిపిస్తూనే వుంది. ఇంతకీ ఈ కథంతా ఎందుకు వ్రాసానంటే, అ భగవంతుడి మహత్యం గురించి చెబుదాము అనిపించి. అప్పుడే కాదండోయ్! గుర్తుకొస్తే, ఇప్పటికీ నా పరిస్థితి అంతే. అదే మరి ముక్తినాద్ మహిమ అంటే. సరేనా!

ఎంతసేపైనా కరంట్ రాలేదు. మా రూములు ఫస్ట్ ఫ్లోర్ లో ఉన్నాయి. కాండిల్ వెలుతుర్లో మెల్లగా అలాగే పైకి వెళ్లి పడుకుని, పొద్దుటే రెడీ అయ్యి మరలా ఇంకొక సారి దేముడిని దర్శించుకుందామని మళ్ళీ కొండ ఎక్కాము.

(మళ్ళీ వచ్చే నెల కలుద్దాం)

# వేమూరి వేంకటేశ్వరరావు



## అనిర్ధారిత సూత్రం

$$\Delta x \, \Delta p \geq \frac{h}{4\pi}$$

THE UNCERTAINTY PRINCIPLE

స్థూల ప్రపంచం ఖణిగా, స్ఫుటంగా అగుపిస్తుంది. సూక్ష్మ ప్రపంచం అంతా మసకే, స్పష్టత లేదు; నిశ్చయంగా 'ఇది' అని ఇదమిత్థంగా చెప్పలేము. ఈ అస్పష్టతని, ఈ అనిశ్చిత స్థితిని ఒక గణిత అసమీకరణం (inequality) లో బంధించి చూపిస్తుంది హైజెన్బర్గ్ ప్రవచించిన అనిర్ధారిత లేదా అనిశ్చితత్వ సూత్రం. అనిర్ధారిత సూత్రం అనేది అణు ప్రపంచానికి సంబంధించిన సూత్రం. ఈ సూత్రం కూడా నిక్కచ్చిగా 'ఇంత' అంటూ ఒకసమీకరణం రూపంలో ఉండదు; 'ఇంతకి ఎక్కువో, లేక ఇంతకి సమానమో' అంటూ నీళ్లు నములుతుంది.

ఈ సూత్రం గుళిక వాదం (Quantum theory) కి ఆయువుపట్టు! ఈ సత్యం ఆవిష్కరించినందుకు హైజెన్బర్గ్ కి నోబెల్ బహుమానం ఇచ్చేరు. హైజన్బర్గ్ ప్రవచించిన అనిర్ధారిత సూత్రం ఎంత మౌలికమో అంత అనుభావాతీతం.

ఈ నేపథ్య సమాచారం అంతా అలా పక్కన పెట్టి హైజెన్బర్గ్ ప్రతిపాదించిన

$$(\Delta x)\,(\Delta p) \geq h/4\pi\,;$$


$$h/4\pi = 5 \times 10^{-35} \text{ joule sec}$$

అనే అసమీకరణం (inequality) ని అర్థం చేసుకుందుకు ప్రయత్నిద్దాం. ఇక్కడ కుడి వైపు ఉన్న $h/4\pi$ విలువ అత్యల్పం అని గమనించండి. అనగా $(\Delta x)$ ని $(\Delta p)$ చేత గుణించగా వచ్చిన లబ్దం ఎల్లప్పుడూ ఈ అత్యల్పమైన విలువ కంటే హెచ్చుగానే ఉంటుంది అని ఈ సూత్రం హెచ్చరిస్తోంది. కుడి వైపు ఉన్న $h/4\pi$ ఎలా వచ్చిందో చెప్పడం కొంచెం కష్టం కానీ, కుడి పక్క భిన్నం విలువ అత్యల్పం కనుక ఎడం పక్క కూడా అత్యల్పం అయినప్పుడే ఈ సూత్రంలోని అంతరార్థం అర్థవంతం అవుతుంది. అనగా ఈ సూత్రం సూక్ష్మ ప్రపంచంలోనే అర్థవంతం అవుతుంది. ఈ సూత్రాన్ని స్థూల ప్రపంచంలో వాడి చూడడం దండగ!

ఇక్కడ $(\Delta x)$ అనేది ఒక రేణువు (లేదా, ఎలక్ట్రాను) ఎక్కడుందో తెలియని మన అజ్ఞానాన్ని సూచిస్తుంది. అదే విధంగా $((\Delta p)$ ఆ రేణువు యొక్క భారవేగం (అనగా, భారాన్ని వేగంతో

గుణించగా వచ్చిన లబ్దం) ఎంతో తెలియని మన అజ్ఞానాన్ని సూచిస్తుంది. ఉదాహరణకి x=0 అయినప్పుడు x ఎడల మన అజ్ఞానం శూన్యం; అనగా, ఎలక్ట్రాను ఎక్కడ ఉందో మనకి కచ్చితంగా తెలుసన్నమాట. అప్పుడు హైజెన్బర్గ్ ఇచ్చిన అసమీకరణం చెల్లాలంటే p అనంతంగా పెరిగిపోవాలి. అనగా, ఎలక్ట్రాను వేగం విపరీతంగా పెరిగిపోవాలి. ఇదే విధంగా, p = 0 అయినప్పుడు p ఎడల మన అజ్ఞానం శూన్యం. అనగా, ఎలక్ట్రాను భారవేగం ఎంతో మనకి కచ్చితంగా తెలుసన్నమాట. అప్పుడు హైజెన్బర్గ్ ఇచ్చిన అసమీకరణం చెల్లాలంటే x అనంతంగా పెరిగిపోవాలి. అనగా, ఎలక్ట్రాను ఎక్కడ ఉందో మనకి తెలియదన్నమాట! దీని సారాంశం ఏమిటంటే ఎలక్ట్రాను వంటి చిన్ని రేణువు ఎక్కడుందో తెలిస్తే దాని వేగం నిర్ధారించలేము, దాని వేగం తెలిస్తే ఎక్కడుందో నిర్ధారించలేము. ఈ రెండింటిని ఒకేసారి నిర్ధారించి కొలవడం అసాధ్యం! కష్టం కాదు; అసాధ్యం! ఇది ప్రకృతి లక్షణమే కానీ మన అసమర్థతకి సూచిక కాదు. అనగా, మనం ఎంత తెలివైనవాళ్ళం అయినా, ఎంత స్ఫూర్తివంతులమైనా ప్రకృతి విధించిన ఈ ఆంక్షని జవదాటలేము.

**వెర్నర్ హైజన్ బర్గ్**



### 1. ఒక స్ఫురణ ప్రయోగం

ఈ విషయం సమగ్రంగా అర్థం చేసుకుందుకు ఒక స్ఫురణ ప్రయోగం (thought experiment) చేద్దాం. ఎలక్ట్రానుని ఎంతో చిన్నదైన నలుసులా ఊహించుకోవచ్చు. అనగా, దాని భారం అత్యల్పం. దీనిని చూడాలంటే దీని మీద ఒక కాంతి కిరణాన్ని ప్రసరించాలి. ఆ కాంతి ఎలక్ట్రాను మీద పడి, పరావర్తనం చెంది, మన కంటికి చేరినప్పుడు ఆ ఎలక్ట్రాను మనకి కనిపిస్తుంది.

ఒక బంతిని కాలితో తన్నగలము కానీ ఒక ఇసుక రేణువుని తన్న కలమా? ఇసుక రేణువు కంటే మన పాదం ఎంతో పెద్దది. కనుక ఇసక రేణువుని కదపడానికి చిన్న పూతిక పుల్లని వాడాలి. అదే విధంగా ఎలక్ట్రాను మీద

పడ్డ కాంతి తరంగం పరావర్తనం చెంది మన కంటికి చేరాలంటే ఎలక్ట్రాను ప్రమాణంలో (అనగా ఒక ఎంగ్^స్త్రం ప్రమాణంలో) ఉన్న అతి చిన్న కాంతి తరంగాలు వాడాలి. కానీ కాంతి తరంగాల నిడివి తగ్గుతున్న కొద్దీ వాటిలో ఇమిడి ఉన్న శక్తి పెరుగుతుంది. అనగా, ఎలక్ట్రాను ఎక్కడ ఉందో "చూడాలంటే" దాని మీద అతి శక్తివంతమైన కాంతిని ప్రసరించాలి. అంత శక్తిమంతమైన కాంతి అంత తేలికగా ఉన్న ఎలక్ట్రాను మీద పడేసరికి తుపాను గాలిలో కాగితంలా ఎలక్ట్రాను ఎగిరిపోతుంది. అప్పుడు దాని వేగం కొలవగలము కానీ అది ఎక్కడుందో నిర్ధారించలేము.

***2. స్థూల ప్రపంచంలో అనిర్ధారిత సూత్రం ఎలా పని చేస్తుంది?***

ఈ సూత్రాన్ని స్థూల ప్రపంచంలో వాడి ప్రయోజనం లేదని పైన అనుకున్నాము కదా. సరదాకి స్థూల ప్రపంచంలో వాడితే ఏమవుతుందో చూద్దాం. ఉదాహరణకి ఒక బంతి భారం (mass) ఒక కిలో (1 kg) ఉంటుందని అనుకుందాం. ఈ బంతిని గంటకి 100 మైళ్ళు (లేదా సెకండుకి 44 కిలోమీటర్లు) జోరుతో విసిరేమనుకుందాం. ప్లేంక్ స్థిరాంకం విలువ,

$h = 6.63 \times 10^{-34}$

అనగా, 6.63 ని భిన్నం యొక్క లవంలో వేసి, భిన్నం యొక్క హారంలో 1 వేసి, దాని పక్కన 34 సున్నాలు చుట్టాలని అర్థం. అనగా, విలువ చాల తక్కువ అని గ్రహించునది! ఇప్పుడు ఈ విలువలని పై సమీకరణాలలో ప్రతిక్షేపించి లెక్క పూర్తి చేస్తే బంతితో కూడిన తరంగం పొడుగు అత్యల్పం అని తేలుతుంది; "బంతి తరంగం" పొడుగు అణుగర్భంలో ఉన్న ప్రోటాను ఉరువు (size) కంటే 20 రెట్లు తక్కువ ఉంటుంది అని తేలుతుంది. (కాగితం, కలం తీసుకుని ఈ లెక్క ని కడితేరా చేసి చూడండి! రెండు నిమిషాల పని!) అనగా, బంతిని కావలిస్తే తరంగంలా ఊహించుకోవచ్చు కానీ పడి లేచే ఆ తరంగం లోని ఎగుడుదిగుడులు అతి సూక్ష్మం - ఆ తేడాలు మన కంటికి ఆనవు. అందుకనే బంతి తరంగంలా కనిపించదు.

***3. సూక్ష్మ ప్రపంచంలో అనిర్ధారిత సూత్రం***

ఇప్పుడు ఇదే లెక్కని సూక్ష్మ ప్రపంచంలో - బంతికి బదులు ఎలక్ట్రానుతో - చేద్దాం.

ఎలక్ట్రాను భారం $= 10^{-30}$ kg

ఎలక్ట్రాను వేగం = 1000 m/s అనుకుందాం.

ఈ విలువలని ప్రతిక్షేపిస్తే "ఎలక్ట్రాను తరంగం" పొడుగు,

$$\lambda = h/mv$$

$$= (663 \times 10^{-34}) / 10^{-30} \times 1000 \text{ nm}$$

ఎరుపు రంగు ఉన్న కాంతి తరంగం పొడుగు దరిదాపు ఈమాత్రం (663 nm) ఉంటుంది. అనగా, ఈ ఎలక్ట్రానుని మనం "చూడగలిగితే" అది ఎర్రగా కనిపించాలి. ఎలక్ట్రాను మన కంటికి కనబడదు కానీ, ఈ ఎరుపు రంగు గీతని వర్ణమాలాదర్శనిలో చూడవచ్చు.

**4. మరొక స్ఫురణ ప్రయోగం**

స్థూల ప్రపంచానికి సూక్ష్మ ప్రపంచానికి మధ్య తేడాని చూపించడానికి మరొక స్ఫురణ ప్రయోగం చేద్దాం. లెక్క సౌలభ్యం కొరకు, $h/4\pi = 1$ అని అనుకుందాం. బిలియర్డ్ ఆటలో వాడే ఒక బంతిని తీసుకుందాం. లెక్క సౌలభ్యం కొరకు ఈ బంతి భారం ఒక కిలో ఉంటుందని అనుకుందాం. ఈ బంతిని బిలియర్డ్ ఆటలో వాడే ఒక త్రిభుజాకారపు చట్రంలో ఉంచుదాం. (ఈ చట్రం త్రిభుజాకారంగా ఉండాలని నియమం ఏదీ లేదు.) ఈ త్రిభుజంలో భుజం పొడుగు ఒక అడుగు లేదా 0.3 మీటర్లు అనుకుందాం. బంతి ఒకే దిశలో (x - దిశలో) మాత్రమే కదలగలదని అనుకుందాం.

ఇవన్నీ చిత్తుగా చేస్తున్న లెక్కలే!
ఇప్పుడు

$(\Delta x) = 0.3$ మీటర్లు.

అనిర్దిష్ట సూత్రం ప్రకారం,

($h/4\pi = 1$ అనుకున్నాం కనుక) $(\Delta x)(\Delta p) \geq 1$ అవుతుంది.

ఇప్పుడు $(\Delta x) = 0.3$ విలువని ఇందులో ప్రతిక్షేపిస్తే

$$(\Delta p) \geq 1/(\Delta x) = 1/0.3 \approx 3 \text{ km/sec}$$

ఇప్పుడు చట్రంలో బందీ అయిన బంతి వేగం (v) లెక్క కడదాం.


బంతి భారవేగం $p = mv$ కనుక

$$(\Delta p) = m(\Delta v)$$

అవుతుంది. ఇప్పుడు

$$(\Delta v) = 1/0.3 = 3 \text{ km/sec}$$

($m = 1$ kg అనుకున్నాం కనుక). అనగా, బంతిని త్రిభుజాకారపు చట్రంలో బంధిస్తే ఆ బంతి నిలకడగా ఉండలేదు; సెకండుకి 3 కిలోమీటర్లు చొప్పున పరిగెడుతూ ఉంటుంది! అనగా గంటకి, ఉరమరగా, 11,000 కిమీ వేగంతో పరిగెడుతూ ఉంటుంది! అంటే,



బొమ్మ 2. చట్రంలో బంధించిన బంతి కథనం

విమానం కంటే జోరుగా!

ఏదీ, ఒక బంతిని చట్రంలో పెట్టి బంధిస్తే ఇంత జోరుగా పరిగెత్తదేమి? కారణం ఏమిటంటే లెక్క సౌలభ్యం కోసం మనం అని అనుకున్నాం. ఇది నిజం కాదు. నిజానికి ; ఈ విలువ వాడి ఉంటే బంతి ఎంత జోరుగా పరిగెట్టేదో మరొక సారి లెక్క వేసి చూడండి. మీకు వచ్చే సమాధానం చెబితే ఆశ్చర్యపోతారు. పది బిలియను (10,000,000,000) సంవత్సరాలలో బంతి ప్రోటాను ఉరువు (size) లో 20 వ భాగం కదిలి ఉండేది! ఆ కదలిక గమనించడం మన తరమా! కనుక స్థూల ప్రపంచంలో అనిర్దిష్ట సూత్రం ప్రభావం కనబడదు.

ఇదే లెక్కని బంతి స్థానంలో ఎలక్ట్రానుని పెట్టి చేద్దాం. త్రిభుజాకారపు చట్రానికి బదులు ఉదజని అణువుని పెడదాం. ఉదజని అణువు ఉరువు ఒక ఎంగ్^స్ట్రం లేదా $1 \times 10^{-10}$ మీటర్లు. ఎలక్ట్రాను భారం $1 \times 10^{-30}$ కిలోగ్రాములు. ఈ విలువలు ప్రతిక్షేపించి లెక్క మళ్లా చేస్తే ఎలక్ట్రాను వేగం సెకండుకి 500 కిలోమీటర్లు వస్తుంది. (పోలిక కోసం: విమానం వేగం, సెకండుకి 0.2 కిలో మీటర్లు. కాంతి వేగం, సెకండుకి 300,000 కిలో మీటర్లు.)

ఈ లెక్కల సారాంశం ఏమిటి? అణు ప్రపంచపు తీరు మనకి పరిచితమైన స్థూల ప్రపంచపు తీరుకి విరుద్ధంగా ఉంటుంది. అణు ప్రపంచంలో మనకి కలిగే అనుభవాలు మనం కనీ, వినీ, ఎరగని అనుభవాలు. ఈ అనుభవాలని వర్ణించి చెప్పడానికి మానవ భాషలలో మాటలు లేవు. మాటలు లేకపోతే పాఠాలు చెప్పడం ఎలా? అందుకని గణిత భాష మీద ఆధారపడక తప్పదు.

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



# ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

సుబ్బలక్ష్మిగారు తన తండ్రి పేరు కలిసినందుకు కృష్ణమోహన్ని "కృష్ణా" అనే పిలుస్తారు. పెద్దకొడుకు అంటే ఆవిడకి ప్రాణం. ఎవరైనా తన పెద్దకొడుకుని సరదాగా ఒక మాట అన్నా ఆవిడ సహించదు. ఆవిడ చాలా అమాయకురాలు, నిస్వార్ధపరురాలు. ఆవిడ ఎప్పుడూ ఎంతోమందికి ఎన్నో రకాలుగా సహాయం చేస్తూ వుండేది. ఈ బొంబాయి బదిలీ అనేసరికి మళ్ళీ కొడుకు విశాఖపట్నం ఎన్నాళ్ళకి తిరిగి వస్తాడోనని ఆవిడకి బెంగ మొదలయింది. కృష్ణమోహన్లాగే ఆవిడ కూడా తన బాధని సాధారణంగా బయటికి చెప్పదు, తనలోనే దాచుకుంటుంది.

పడుకునే ముందు వాక్ మేన్ లో శోభారాజ్ పాడిన అన్నమాచార్య కీర్తనలు వింటున్నాడు కృష్ణమోహన్. అందులో తనకెంతో ఇష్టమైన "కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు" వింటూ కళ్ళు మూసుకొని, తిరుమల కొండ మీద "శ్రీ వేంకటేశ్వరస్వామి" విగ్రహాన్ని ఊహించుకుంటూ తన్మయత్వం చెందుతున్నాడు.

అదే సమయానికి రుక్మిణి పనులన్నీ ముగించుకొని ఈనాడు పేపర్ తీసుకొని పక్క మీదకు చేరింది. శ్రీవారు వాక్ మేన్ తగిలించుకొని తన్మయత్వంలో ఉండటం చూసి డిస్టర్బ్ చేస్తే లాభం లేదని, ప్రక్కన పడుకొని పేపర్ చదువుతున్నాది.

రుక్మిణికి పడుకునే ముందు ఓ పావుగంట పేపర్ గాని పుస్తకముగాని చదవటం అలవాటు. అలాచేస్తే, నిద్ర త్వరగా వస్తుందని తన నమ్మకం. తను పేపర్ చదవటం అయిపోయిందిగాని, కృష్ణమోహన్ ఇంకా తన్మయత్వంలో వుండటం చూసి అతనిని తట్టి "శ్రీ కృష్ణ పరమాత్మా, ఈ భక్తురాలిని కాస్త కరుణిస్తారా" రుక్మిణి రావడం, పేపర్ చదవడం ఇవన్నీ గమనించని కృష్ణమోహన్ "నువ్వెప్పుడు వచ్చావు, పనులు పూర్తయినాయా?" అన్నాడు.

"స్వామీ వచ్చి అరగంట అయింది, మీరు మీ ధ్యానంలో వున్నారు. ఈ నెల్లాళ్ళు ఆ వాక్మాన్ ప్రక్కన పెట్టి నా మొరాలకించండి, ఈ దీనురాలిని కరుణించండి" అని నాటక ఫక్కీలో అంది రుక్మిణి.

"ఎంత మాట అన్నావు రుక్కూ"... ఆ రుక్కూ అన్న మాట ఏ.ఎన్.ఆర్. స్టైల్లో వత్తి పలుకుతూ అన్నాడు.

"ఎలాగండి! ఆరు నెలలు మీకు దూరంగా వుండటం" మళ్ళీ ఉదయం ఫోన్లో చెప్పిన మాటే చెప్పింది రుక్మిణి. ఆ విషయం గురించి రుక్మిణి తీవ్రంగా ఆలోచిస్తున్నాదని అర్ధమయింది కృష్ణమోహన్కి.

"రుక్కూ, ఇలా దగ్గరకు రా" అని దగ్గరకు తీసుకున్నాడు. అతని గుండెల మీద తల పెట్టి రుక్మిణి పడుకుంది. "పిచ్చిదానా, నేను మాత్రం ఎలా వుండగలను అనుకున్నావు? నా గుండెల చప్పుడులో నీ పేరు వినపడటం లేదూ! అవతారపురుషుడు ఐన శ్రీ రామచంద్రులవారికి, జగన్మాత సీతమ్మకే ఎడబాటు తప్పలేదు, మనమెంత! మానవ మాత్రులం ఏం చేస్తాము? అయి నా విరహం తరువాత కలయిక మధురం అంటారు పెద్దలు !! అందుకని ఆ మధురం కోసం ఎదురు చూద్దాము " అని కొంచెం నచ్చచెప్పాడు.

"ఇలా మీ గుండెలమీద తల పెట్టుకొని పడుకుంటే చాలండి, ఈ జన్మకి ఇంకేమీ అక్కర్లేదని పిస్తుంది" సాధారణంగా రుక్మిణి

కి ఎప్పుడైనా భయం వేసినపుడు లేదా పీడ కలలు వచ్చినపుడు అలా తల పెట్టుకొని పడుకొంటుంది.

"నాకేమి అనిపిస్తుందో తెలుసా, నువ్విలా నా ప్రక్కన వుంటే చాలు, నేను ఏ కష్టాన్నయినా, ఒడిదుడుకునైనా ఎదిరించి జయించగలను అనిపిస్తుంది"

'నేనిలాగే పడుకుంటాను' అని రుక్మిణి అతని గుండెలమీద తల తీయకుండా మరింత గట్టిగా పట్టుకొని అలాగే నిద్ర పోయింది.

*************

కృష్ణమోహన్ దంపతులు పెళ్ళి పిలుపులు మొదలుపెట్టారు. కారులో తిరిగినా మొత్తం విశాఖ పట్నం కవర్ చేయడానికి మూడురోజులు పట్టింది. కృష్ణమోహన్ పినతండ్రి నరహరిగారు, ఆయన భార్య జయంతిగారు 17వ తేదీ ఉదయం గోదావరిలో వచ్చారు, నరహరిగారి వయసు 65 సంవత్సరాలు, జయంతిగారు ఆయన కన్న 5 సంవత్సరాలు చిన్న. కానీ చూడటానికి ఇద్దరూ ఇంకా చిన్నవాళ్ళలాగ కనబడతారు, ఆ వయసులో కూడా చలాకీగా వుంటారు. వాళ్ళ తరం వారితో కంటే, వాళ్ళ తరువాతి తరం వారితో ఎక్కువగా కలిసి వుంటారు.

నరహరిగారు ఎక్కడ వుంటే అక్కడ ఒక రకమైన హడావుడి వుంటుంది. మధ్యాహ్నం భోజనాల సమయంలో కృష్ణమోహన్ ఆయనని కలిసి పలకరించాడు. "ఏరా యూజ్లెస్ ఫెలో, మొన్న బెంగుళూర్ వెళ్ళినపుడు హైద్రాబాద్ ఎందుకు రాలేదు" అన్నారు నరహరిగారు. అసలు విశాఖ నుండి బెంగుళూర్ వెళ్ళేటప్పుడు హైద్రాబాద్ ఎక్కడైనా టచ్ ఆవుతుందా! అవదు, అదే నరహరి గారి హడావిడి అంటే.

"వాడి వయసు 47 సంవత్సరాలు, ఉంకో నాలుగయిదు సంవత్సరాల్లో తాతగారి హోదాకు చేరుకుంటాడు. వాణ్ణి పట్టుకొని యూజ్లెస్ ఫెలో, స్టుపిడ్ అంటారేమిటి? ఇలా అయితే కోడలుపిల్ల కాఫీ కూడా ఇవ్వదు జాగ్రత్త" అని సున్నితంగా మందలించింది జయంతిగారు.

"ఏం పరవాలేదు, మీ అబ్బాయికి కూడా అలా అనే అలవాటు వుంది. ఇన్నాళ్ళూ మేము చిన్నవాళ్ళం కనుక ఏమీ అనలేకపోయాము, ఇప్పుడు ఆ మ్యూజిక్ ఆయన్నీ ఆస్వాదించనీయండి. మామయ్యగారూ,ఒక కాఫీ కాదు రెండు కాఫీలు ఇస్తాను" అని కృష్ణమోహన్ని ఏడిపించింది రుక్మిణి.

"మేడం, నా తిట్లే వాళ్ళకు దీవెనలు. చిన్న వాళ్ళని పెద్ద వాళ్ళు పొగడకూడదు" అన్నారు నరహరి గారు.

"అది సరేగాని బాబయ్యా, నిన్ను పర్చేజింగ్ డిపార్ట్మెంట్కి జనరల్ మేనేజర్గా అపాయింట్ చేసాము. ఈ రోజునుండి మూడు రోజుల్లో అంటే 19వ తేదీకల్లా మొత్తం పెళ్లి కోసం కొనవలసిన బట్టలు, వస్తువులు కొనెయ్యాలి. కారు నీ ఆధీనంలో వుంటుంది, చంద్రం, కమల, వైదేహి, పిన్ని నీతో వస్తారు. నేను, రుక్కూ మిగిలి వున్న పెళ్ళిపిలుపులు పూర్తి చేస్తాము" అన్నాడు కృష్ణమోహన్.

"ఇంతకీ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ చంద్రమోహన్ గారెక్కడ?"అని చంద్రం చంద్రం గురించి అడిగారు నరహరిగారు.

"ఇప్పుడే ఫోన్ చేసారు ఏ క్షణాన్నయినా వస్తానన్నారు, మనల్ని రడీగా వుండమన్నారు. రేపటి నుండి శెలవు పెట్టేసారు" మళ్ళీ ఇంకో ప్రశ్నకి అవకాశం ఇవ్వకుండా టకటకా చెప్పింది కమల.

ఇరవయ్యో తారీఖు ఉదయం మళ్ళీ అందరూ సమావేశము అయ్యారు. అంతవరకు చేసిన పనుల గురించి, ఇకపై చేయవలసిన పనుల గురించి చర్చించారు, ఇకమీదట ఎవరేపనులు చేయాలో నిర్ణయించుకున్నారు.

"బాబయ్యా మీరు పెద్దవాళ్ళు, అనుభవజ్ఞులు. అందుకని నువ్వూ, పిన్నీ మగపెళ్ళివారి బాధ్యత స్వీకరించండి, వాళ్ళు వచ్చిన దగ్గరనుండి వెళ్ళే వరకూ వాళ్ళ సంగతి అంతా మీరిద్దరు చూసుకోండి అంది వైదేహి. ఆమె మాటకి వంత పాడాడు సత్యనారాయణ.

"అలాగే వైదేహి, నువ్వు ఏమీ బెంగపడకు, నేనూ, మీ బాబయ్య మగపెళ్ళివారి అవసరాలన్నీ దగ్గరుండి వాళ్ళకి ఏ లోటు రాకుండా చూసుకుంటాము" అన్నారు జయంతిగారు.

పనులన్నీ సమీక్ష చేసుకున్నాక బంగారం షాప్ నుండి వస్తువులు ఇంకా తీసుకురావాలని అర్థమయ్యింది. ఆ వస్తువులు తీసుకు రావటానికి కృష్ణమోహన్, రుక్మిణి బయలుదేరి వెళ్ళారు.

(ఇంకా ఉంది)

# పాలెపు బుచ్చిరాజు



# ముల్లా నస్రుద్దీన్ కథలు - 10

## ఎత్తుకి పై ఎత్తు

ముల్లా నస్రుద్దీన్ పుట్టి పెరిగిన
దేశంలో ధనవంతులు చాలా
తక్కువ. చాలామంది బీదవారు.
పంటలు లేక కరువు కాటకాలతో
ను, తిండిలేక అనారోగ్యాలతోను
సామాన్య ప్రజలు బాధలు పడు
తూ ఉండేవారు. ధననవంతులు
బీదవారిని, అమాయకుల్ని దోచు
కోవడం పరిపాటి. ఉద్యోగులు
కూడా లంచాలు తిని డబ్బున్నవా
రిని ఆదరించేవారు. డబ్బులేని
వారిని దండించేవారు.

ఆ గ్రామంలో ఒక బక్క చిక్కిన
అడుక్కునేవాడు ఉండేవాడు.
చింపిరి బట్టలతో, లోపలికంటా
అతుక్కుపోయిన కడుపుతో, వీధి
వీధినా తిరిగి అడుక్కుని, ఎవరు
ఏం పెడితే అది తిని కడుపు నిం
పుకునేవాడు.

ఒకనాడు ఎంత తిరిగినా
అతనికి ఒక పిడికెడు బిచ్చం
కూడా దొరకలేదు. నాలుగు రోజు
ల నుంచి అన్నం లేక కడుపు
నకనకలాడిపోతోంది. అతనలా
దారి వెంట నడిచి పోతూ ఉంటే
అతని ముక్కు పుటాలకి చక్కని
వంటకాల సుగంధం సోకింది.
ముక్కుకి అది ఒక పిండి వంట
అని తెలియగానే అతని నోరూర
సాగింది. ఇటూ అటూ కలయ
జూశాడు . వీధి చివర ఒక భోజ
నశాల కనిపించింది. ఆ సువాస
న అక్కడి నుంచే వస్తోంది. లేని
ఓపిక తెచ్చుకుని అతనక్కడికి



పరుగు పరుగున వెళ్లాడు. అక్క
డ లోపల ఎందరో విందు ఆర-
గిస్తున్నారు. బల్ల దగ్గర ఒక
దుబ్బు మీసాలాయన కూర్చుని
ఉన్నాడు. ఆయనే ఆ భోజనశా ల
యజమాని. బిచ్చగాడు ఆయ
న ముందు నిలబడి, " అయ్యా!
మీ వంటశాలలోంచి చాలా చక్క
ని పిండివంట వాసన వస్తోంది.
నాలుగు రోజుల నుంచి తిండి లేక
కడుపుమాడి పోతోంది. దయచేసి
కాస్త ధర్మం చెయ్యండి బాబూ!
మీకు పుణ్యంఉంటుంది" అని
అడిగాడు.

ఆయన ముందుగా వాడిని
చూసి చీదరించుకున్నాడు. పైగా
వాడు భోజనం కూడా పెట్టమన
డంతో కోపం వచ్చింది. మీసాలు
తిప్పుతూ "ఏరా! దమ్మిడికి కొర
గాని వాడివి. నా ముందు నిలబ
డడమే కాకుండా పిండి వంట
కావాలా? పిండి వంట! ఇంత
సేపూ ఇక్కడ నిలబడి నా పిండి
వంటల ఘుమఘుమలు వాసన
చూస్తున్నావన్నమాట. నీకు తెలి
యదేమో, ఈ భోజన శాలలో
తినుబండారాలు వాసన చూడ-
డానికి కూడా డబ్బులు వసూలు
చేస్తాం. ఇప్పుడు నువ్వు వాసన
చూసినదానికి వంద బంగారు కా
సులు వెంటనే జరిమానా కట్టు "
అని వాడిని బెదిరించాడు.

ఆ బిచ్చగాడికి పై ప్రాణం పైనే
పోయింది. కాస్త ధర్మం చేయమ
ని అడుక్కుంటే, పెట్టలేదు సరి
కదా డబ్బు కూడా తెమ్మంటున్నా-
డు. కటిక బిదవాడిని నేను. నాకు
బంగారు కాసులు ఎక్కడినుం-
చి వస్తాయి. అవి ఉంటాయని
వినడమే కాని ఎప్పుడూ చూసిన
పాపాన పోలేదు. అని తలపోసి,
ఆ పెద్దాయనతో " సాహెబ్ జీ!

నన్ను చూడండి. నాకు అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? నేనెలా ఇచ్చుకోగలను?. క్షమించండి. మరెప్పుడూ ఇటు రాను " అని వెళ్ళిపోబోయాడు.

యజమాని వాడి దారికి అడ్డం నిలబడి, "నాకదంతా తెలియదు. నువ్వు డబ్బు ఇవ్వవలసిందే. లేక పోతే ఇప్పుడే నిన్ను మన ఊరి వజీరు ముందు దోషిగా ఫిర్యాదు చేస్తాను" అని వాడిని ఈడ్చుకుపోయి వజీరు ముందు నిలబెట్టాడు.

ఆయన వాడిని ఎగా దిగా పరీక్షించి, "ఏరా! ఇది నిజమేనా?" అని అడిగాడు.

ఆ బిచ్చగాడు వాసన చూసిన మాట నిజమే అని చెప్పి, "అది నా నేరం కాదు. నన్ను వదిలి పెట్టండి" అని వేడుకున్నాడు. ఆ వజీరుకి ఇలా ధనవంతులతో చేయి కలిపి, అమాయకుల్ని మోసగించి, డబ్బు వసూలు చేయడం మామూలే. మొత్తం వచ్చిన డబ్బులో సగభాగం అతనికి లంచంగా వెళ్తుంది. అందుకని ఆయన, "అయితే నువ్వు నేరం నేరం చేసినట్టే లెక్క. వంద బంగారు కాసులు ఎలాగైనా జరిమానా కట్టక తప్పదు. కాకపోతే నువ్వు బీదవాడివి కాబట్టి రేపటిదాకా గడువు ఇస్తున్నాను. ఎక్కడైనా అప్పుచేసో, కన్నం వేసో డబ్బు తెచ్చుకో. లేకపోతే నీకు బంది ఖానా తప్పదు" అని అప్పటికి వాడిని విడిచి పెట్టాడు.

ఒక ప్రక్క ఆకలి, మరొక ప్రక్క ఈ బంది ఖానా భయం దహించి వేస్తూ ఉంటే, ఆ బిచ్చగాడు ఏడుస్తూ ఒక చెట్టు క్రింద కూలబడి పోయాడు. అదే సమయంలో నస్రుద్దీన్ ఏదో పని మీద అటుగా వెళ్ళడం తటస్థించింది. అతి దీనావస్థలో కొట్టుమిట్టాడుతున్న అతన్ని చూసి జాలి పడి, "ఏమయింది తాతా! అలా బాధపడుతున్నావు?" అని పలకరించాడు.

తన గోడు వినేందుకు ఎవరో ఒకరు దొరికారూ కదా అని, ఆ బిచ్చగాడు ముల్లాకి తన కథనంతా వినిపించాడు. "చూడండి ముల్లాగారూ! ఇదెక్కడిన్యాయం? ఈ కష్టం లోంచి బైట పడడానికి మీరే నన్ను ఆదుకోవాలి" అని కాళ్ళా వేళ్ళా పడ్డాడు.

అతని కథనంతా సావకాశంగా విన్న నస్రుద్దీన్, ప్రభుత్వోద్యోగులు, వ్యాపారస్తులు అమాయకుల్ని ఎలా దోచుకుంటున్నారో అర్థం చేసుకున్నాడు. వీళ్ళ పని పట్టాలని ఒక ఎత్తు వేశాడు. ఆ ముసలి వాడికి ధైర్యం చెప్పి, "రేపు అనుకున్న సమయానికి వాళ్ళ బాకీ మనం తీర్చేద్దాం. నువ్వేమీ బాధపడకు." అన్నాడు.

తరవాత ముష్టివాడిని తనతో ఇంటికి తీసుకుని వెళ్లి, భోజనం పెట్టి ఆ రాత్రికి అక్కడే పడుకోమని చెప్పాడు.

మర్నాడు దుకాణాలు తెరిచే సమయానికి వంద బంగారు కాసులు ఉన్న ఒక సంచీ తీసుకుని, ముసలివాడిని వెంటబెట్టుకుని, వజీరు ఇంటికి వెళ్ళాడు. అప్పటికే భోజనశాల యజమాని అక్కడికి వచ్చి ఉన్నాడు.

ముసలిని చూస్తూనే వజీరు,"ఏరా! కాసులు తెచ్చావా?" అని ప్రశ్నించాడు.

"తెచ్చాను బాబయ్యా! ఇదుగో ముల్లా గారు నాకు సహాయం చేశారు." అంటూ అతను ముల్లాని చూపించాడు.

"అయితే ఇంకా ఆలస్యం ఎందుకు? ముల్లా గారూ ఆ సంచిని ఇలా ఇవ్వండి. తొందరగా. బాకీ తీర్చాలి కదా!" అంటూ చేయిచాపాడు యజమాని. అప్పుడు ముల్లా ముందుకు వచ్చి, యజమానికి దగ్గరగా నిలబడి, అతని చెవుల దగ్గర ఆ డబ్బు సంచి పెట్టి, గట్టిగా ఊపి, "అయ్యా కాసుల గల గల బాగా వినిపించిందా?" అని అడిగాడు.

"నేనేం చెవిటి వాడి ననుకున్నారా! ముల్లా గారూ. చక్కగా వినిపించింది. అవి నిజంగా బంగారు కాసులే అని చెప్పగలను. మరి నా కాసులు నాకు ఇప్పించండి." అన్నాడు.

"ఇంకెక్కడి కాసులు? మీ బాకీ పూర్తిగా తీరిపోయింది కదా!" అన్నాడు నస్రు.

ఆ వజీరుకి, యజమానికి ముల్లా ఏమంటున్నాడో అర్థం కాలేదు. "మీరేదో పరాచికా లాడుతున్నా

( 21 వ పేజీ చూడండి)

## పోడూరి శ్రీనివాసరావు



# సుధా మూర్తి

సుధా కులకర్ణి కర్ణాటక రాష్ట్రంలో గల 'శిగ్గామ్ ' అనే ప్రదేశంలో డా.హెచ్ ఆర్ కులకర్ణి, శ్రీమతి విమల కులకర్ణి దంపతుల సంతానంగా 19 ఆగస్ట్ 1950 వ తేదీన జన్మించారు. బాల్యం నుంచి ఎంతో తెలివిని ప్రదర్శించే సుధ, తన చిన్నతనాన్ని తల్లితండ్రుల వద్ద, మాతామహుల వద్ద గడిపారు.

ఎంతో ప్రతిభ గల సుధ ప్రతిష్ఠాత్మకమైన BVB కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లో పట్టభద్రురాలయ్యారు. ఈ కాలేజ్ ప్రస్తుతం KLE టెక్నలాజికల్ యూనివర్సిటీ గా పిలవబడుతోంది. ఇంజినీరింగ్ లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైన సుధ, కాలేజ్ టాపర్ గా నిలిచి, అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ ఉర్స్ గారి చేతుల మీదుగా బంగారు పతాకం అందుకున్నారు. అనంతరం భారతదేశంలోనే అత్యంత ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ లో కంప్యూటర్ సైన్సెస్ ప్రధానాంశంగా మాస్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ (ME) చేయడమే కాకుండా, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయ్యి, ఉత్తమ విద్యార్థిగా, కాలేజ్ ప్రథమురాలిగా, బంగారు పతాకం సాధించారు.

భారతదేశంలో అతి పెద్ద ఆటోమొబైల్ నిర్మాణ సంస్థగా పేరుగాంచిన టాటా ఇంజినీరింగ్ అండ్ లోకోమోటివ్ కంపెనీ (టెల్కో), పూణే లో డెవలప్మెంట్ ఇంజినీర్ గా చేరారు. పురుషాధిక్యత ఉన్న టెల్కోలో కంపెనీ చైర్మన్ కు పోస్ట్ కార్డు ద్వారా తన అభిప్రాయాన్ని తెలిపినందుకు యాజమాన్యం పురుష వివక్షత చూపుతున్నందుకు నిరసనకు బదులుగా, ఆమె తెలివితేటలను, ధైర్యాన్ని గుర్తించి ఆమెను సంస్థలో చేర్చుకోవడం జరిగింది.

చైర్మన్ ఆమెకు ప్రత్యేక ఇంటర్వ్యూకు అవకాశమిచ్చి తక్షణమే ఆమెను విధులకు హాజరుకమ్మని తెలిపారు, టెల్కోలో డెవలప్మెంట్ ఇంజినీర్ గా సుధ, పూణే, ముంబై, జంషెడ్పూర్ లలో పని చేశారు. అనంతరం పుణేలో గల వాల్ చంద్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ లో సీనియర్ సిస్టమ్స్ అనలిస్ట్ గా పనిచేశారు.

పుణేలో టెల్కోలో పనిచేస్తున్న సమయంలోనే శ్రీ నారాయణమూర్తిని కలుసుకోవడం, వివాహం చేసుకోవడం జరిగింది. వారికి ఇద్దరు సంతానం కలిగారు- అక్షత, రోహన్.


పుణేలో 1974 నుంచి 81



పనిచేసిన సుధ, తరవాత ఇన్ఫోసిస్ ప్రారంభిస్తున్న సమయంలో తాను దాచుకున్న డబ్బులనుంచి ఇన్ఫోసిస్ కంపెనీ ప్రారంభ పెట్టుబడిగా పదివేల రూపాయలను ఇన్ఫోసిస్ కు అందజేశారు. 1996 లో ఆమె ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ను ప్రారంభించారు. ఇప్పటికీ ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ట్రస్టీగా కొనసాగుతున్నారు.

ఆమెకెంతో ఇష్టమైన అభిరుచి బోధన. తన విజ్ఞానాన్ని తన బోధనల ద్వారా నలుగురికీ పంచడమంటే ఆమెకు ప్రాణప్రదం. ఎప్పుడూ తన విజ్ఞానాన్ని పెంపు చేసుకోవడానికి చదువుతూ ఉంటారు. బెంగళూరు యూనివర్సిటీకి సంబంధించిన పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్ లో ఇప్పటికీ ఆమె విజిటింగ్ ప్రొఫెసర్ గా తన సేవలనందిస్తూ, విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు పాటుపడుతున్నారు. అదేవిధంగా క్రీస్ట్ కాలేజ్ లో కూడా బోధిస్తుంటారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో, సేవా సంబంధ కార్యక్రమాలలో శ్రీమతి సుధా మూర్తి ఎప్పుడూ ముందుంటారు. ఆడవాళ్ళకు సాధికారత, గ్రామీణ విద్యావికాసం, దారిద్ర్య నిర్మూలన, జనబాహుళ్యానికి ఆరోగ్యమందించడం (అందరికీ ఆరోగ్యం) - ఇలా ఎన్నో విశేషాలు ఆమె చేపట్టే కార్యక్రమాల్లో చోటు చేసుకుంటాయి. స్వచ్ఛ భారత్ ను అభివృద్ధి పరచడానికి, అమలు చేయడానికి, ప్రజలకు మరుగుదొడ్ల సదుపాయానికి, తన వంతుగా అనేక నిర్మాణాల్లో చేయూతనందించారు. వరద బాధితులకు సహాయ పడటంలో శ్రీమతి సుధామూర్తి ఎప్పుడూ ముందుంటారు.




కన్నడ భాషలోనూ, ఇంగ్లీష్ భాషలోనూ విస్తృతంగా రచనలు చేశారు. ఎన్నో కథలను, వివిధ కోణాలు స్పృశిస్తూ శ్రీమతి సుధామూర్తి వ్రాసారు. ఆమె కథావస్తువులు జన బాహుళ్యం నుంచే తీసుకోబడ్డాయి. ఆమె బాల్యం, ఆదరణ, ఆత్మీయత, దానధర్మాలపై ఆమె ఆలోచనలు, దాతృత్వం, సామాజిక స్పృహను తట్టి చూపే అనేక అంశాలు కథావస్తువులుగా ఆమె రచనలు సాగాయి.

ఆమె కన్నడంలో వ్రాసిన అనేక కథలు ఇంగ్లీష్ లోకి తర్జుమా చేయబడ్డాయి. కొన్ని, టీవీ సీరియల్స్ గా వెలుగు చూశాయి. చిన్న పిల్లలకై ఎన్నో కథలు ప్రత్యేకంగా వ్రాసారు. కన్నడంలోనూ, ఇంగ్లీషులోనూ ఎన్నో ఫిక్షన్ రచనలు చేశారు. ఆమె పుస్తకాలు ప్రముఖంగా పెంగ్విన్ సంస్థ ద్వారా విడుదల కాబడ్డాయి. కన్నడ భాషలో ఆమె వ్రాసిన పుస్తకాల్లో ప్రముఖమైనవి:

1) డాలర్ సోస్
2) కావేరీ ఇంద మెకానిగే
3) రుద
4) హక్కియ తెరదల్లి
5) గుత్తోంద హేలువే...

మొదలైనవి.

ఆమె వ్రాసిన పుస్తకాల్లో ప్రముఖమైనది - How I taught my grand mother to read and other stories. ఈ పుస్తకం బహుళ జనాదరణ పొందడమే కాకుండా 15 ఇతర భాషల్లోకి అనువదించబడింది. తన మాతామహులతోనూ. పితామ-

హులతోనూ బాల్యంలో గడిపిన మధుర స్మృతుల సమాహారమే ఈ పుస్తకం ప్రధానాంశం. House of Cards పేరుగల ఆమె వ్రాసిన మొట్టమొదటి నవల ఒక డాక్టరు, అతని భార్య మధ్య చెలరేగే భావోద్వేగ అంతర్మథనమే ఈ నవల కధావస్తువు.

శ్రీమతి సుధామూర్తి చదువుకునే రోజులనుంచీ ఎన్నో గొప్ప ప్రతిష్టాత్మక అవార్డులు గెలుచుకున్నారు. అనంతరం 2004 లో చెన్నైలో గల ప్రతిష్టాత్మక రాజ్యలక్ష్మీ ఫౌండేషన్ వారి రాజ్యలక్ష్మి అవార్డును స్వంతం చేసుకున్నారు. సాంఘిక, సామాజిక సేవలో అత్యంత ప్రతిభను చూపినందుకు ఆమె ఈ అవార్డుకు ఎంపిక అయ్యారు. 2006 లో భారత ప్రభుత్వంనుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. వారి రచనలకు డాక్టరేట్ కూడా సాధించుకున్నారు.

ఒక భారతీయ సంఘ సేవకురాలిగా, రచయిత్రిగా పేరొందిన శ్రీమతి సుధామూర్తి కంప్యూటర్ ఇంజనీర్ గా జీవితాన్ని ప్రారంభించి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మరియు గేట్స్ ఫౌండేషన్ ప్రజారోగ్య విభాగాలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ఆమె పలు అనాధాశ్రమాలను ప్రారంభించారు. గామీణాభివృద్ధికి సహకరించారు. కర్ణాటకలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్ లు అందించి, తద్వారా పేద



విద్యార్థులు కంప్యూటర్ విద్య నేర్చుకునే అవకాశం కల్పించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో భారతీయ గ్రంధాలతో The Murthy Classical Library of India ప్రారంభించారు. తన వృత్తి జీవితంతో పాటు ఈమె ఒక మంచి కంప్యూటర్ సైన్స్ ఉపాధ్యాయురాలు. కాల్పనిక రచనలు చేయడంలో బహు దిట్ట. ఈమె రచించిన కన్నడ నవల 'డాలర్ సోసే' (డాలర్ కోడలు) ఆంగ్లంలో 'డాలర్ బహు' గా అనువదింపబడటమే కాకుండా 2001 లో జీ టీవీ లో ధారావాహికంగా ప్రసారమయ్యింది.

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా హెచ్ ఆర్ కాదిం దివాన్ బిల్డింగ్ హౌసింగ్ మరియు ఐ. ఐ. టి కాన్పూర్ లో కంప్యూటర్ సైన్స్ విభాగాలను, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలోని నారాయణరావు మెల్గేరి స్మారక న్యాయ కళాశాలను ప్రారంభించడానికి భూరి విరాళాలను శ్రీమతి సుధామూర్తి అందించారు.

శ్రీమతి సుధామూర్తి ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధినేతగా పలుసేవలు అందిస్తున్నారు. అలాగే ఇన్ఫోసిస్ మరియు పెట్టుబడిదారీ సంస్థ అయిన కేటమారన్ వెంచర్స్ కు ముఖ్య పెట్టుబడిదారుగా వ్యవహరిస్తున్నారు.

2004 లో సామాజికసేవకు రాజలక్ష్మి పురస్కారము, 2006 లో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ, సామాజిక సేవ, దాతృత్వం మరియు విద్యారంగాలలో ఆమె సేవలకు డాక్టరేట్, మనదేశంలో న్యాయ విద్య మరియు ఉపకార వేతనాల అందవేతకు ప్రముఖ న్యాయవేత్త సంతోష్ హెగ్డే తో కలిసి గోరవ న్యాయ డాక్టరేట్ (Honoraray LLD (doctor of laws)), సాహితీసేవ మరియు ఆమె రచనలకు ఆర్ కె నారాయణ్ పురస్కారం ఈమెకు లభించిన ఎన్నో అత్యుత్తమ పురస్కారాల్లో కొన్ని మాత్రమే!

ఎంతో ప్రాచుర్యం పొంది పదిహేను భాషలలోకి తర్జుమా చేయబడిన How I taught my grand mother to read and other stories మాత్రమే గాక, ఇటీవలే రచించిన 'The Day I stopped drinking Milk', 'Wise and otherwise', 'Old man and his God', 'Gently falls the Bakula' మొదలైనవి కూడా బహుళ పాఠకాదరణ పొందిన శ్రీమతి సుధామూర్తి రచనల్లో కొన్ని.

# యాంకర్, సీరియల్, సినీ ఆర్టిస్ట్ శ్రీమతి నూకల భానుశ్రీ

శ్రీమతి భానుశ్రీ కూతురుగా, భార్యగా, తల్లిగా, యాంకర్ గా, సీరియల్ సినీ ఆర్టిస్ట్ గా ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న అందాల, అణుకువైన, సాంప్ర-దాయానికి మారుపేరైన స్త్రీ.

శ్రీమతి భానుశ్రీ ( నూకల భానుమతి) స్వగ్రామం తణుకు దగ్గర పెరవలి. కాకరపర్రు హైస్కూల్ లో చదివారు. ఇంటర్ మీడియట్ తణుకు లోని ఎస్. ఎన్.వి.టి. జూనియర్ కాలేజీలో చదివారు. ఇంటర్ మీడియట్ చదివేటప్పుడు స్పోర్ట్స్ లో (రన్నింగ్ 100 మీటర్స్, 200 మీటర్స్, 400 మీటర్స్, 800 మీటర్స్ , లాంగ్ జంప్, హై జంప్ అలాగే గేమ్స్ లో ఖోఖో, టెన్నికాయిట్, షటిల్ లలో పార్టిసిపేట్ చెయ్య-డమే కాక, చాంపియన్ కూడా ఆ కాలేజీలో. డిగ్రీ (బి .ఏ ) ఫైనల్ ఇయర్లో ఉండగా ఏ.జి. ఆఫీస్ లో వర్క్ చేస్తున్న ఎన్. బి. వి. ప్రసాద్ గారితో వివాహం అయ్యింది. ఇద్దరు పిల్లలు. భానుశ్రీ గారికి. తరువాత 1997 లో యాంకర్ గా 'సి ఛానల్' లో ఆఫర్ వచ్చి, అప్పటి నుండి అంతటా తిరు-గులేని మహారాణి అయ్యారు. తల్లి తండ్రులకు, భర్తకు, ఈ ఫీల్డ్ కి ఏమిచ్చినా ఋణం తీర్చుకో-లేనన్న భానుశ్రీ గారిని చూస్తూ మనతో పంచుకున్న భానుశ్రీ గారి అనుభవాలు వారి మాటల్లో విందామా !

---

## ఎత్తుకి పై ఎత్తు

( 17 వ పేజీ తరువాయి)

రు ముల్లా గారూ! మీరింకా ఆ డబ్బుని యజమానికి ఇవ్వందే బాకీ ఎలా తీరుతుంది?" అని ప్రశ్నించాడు వజీరు.


"అలాగంటారేమిటండీ వజీరు గారూ! వంటశాల లోనుంచి వచ్చిన ఘుమఘుమల వాసనకీ, వంద కాసుల గలగలలకీ బాకీ చెల్లు. ఆయన ముక్కుతో వాసన చూశాడు, ఈయన చెవులతో చప్పుడు విన్నాడు. సరిపోయింది. ఇంకా బాకీ ఎక్కడుంది?" అని వారిని నిలదీశాడు ముల్లా.

అప్పటికి అర్థం అయింది ఆ మోసగాళ్లిద్దరికీ ముల్లా తెలివి తేటలతో వారికి బుద్ధి చెప్పాడని. తప్పు తెలు-సుకుని వారిద్దరూ ముఖాలు దించుకున్నారు.

"చూడండి మీరు అధికార దర్పంతోను, డబ్బుందనే గర్వం గర్వంతోను ఇలా అమాయకుల్ని మోసం చేయడం మంచిది కా దు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకు ని ప్రజల్ని మోసం చేయడం మా నుకోండి. ఈ విషయం నేను పాదుషావారి వరకు తీసుకుని వెళ్తే ఏమౌతుందో తెలుసునా? వజీరు ఉద్యోగం ఊడిపో-తుంది. ఈ యజమాని కి శిక్ష పడుతుంది" అని బెదిరించాడు.

దానితో వారిద్దరూ హడలిపోయి, ముల్లా కాళ్ళ మీద పడ్డారు. "తప్పయి పోయింది. క్షమించండి. ఇంకెప్పు-డూ ఇలా చేయము" అని లెంపలు వేసుకున్నారు.

# వేదుల సుబ్రహ్మణ్యం



## ఎన్నికలకు యుక్తులు - ఎన్నికల కుయుక్తులు

ఉ. చెల్లిననాళ్ళు చెల్లవిక చేసిన యుక్తులు మాయమర్మముల్
పిల్లిని జంకబెట్టుకొని పేరటముంజన సైచియుండు వా
రెల్లెడ నుందురే? మరియికెన్నితరంబుల నోపనౌదు! తా
మెల్లి యెరుంగ నేర్తురిక నెల్లరు నిగ్గునుతీర్చి గూర్చినన్! ॥ 1

ఉ. ఎప్పటిదాక నిట్టులిక! ఎన్నికలంచు పరస్పరంబునున్
కప్పల తక్కిడల్లె యిటు గంతులు వేయుచు నుందురో మదిన్
మెప్పును గోరి దేశమున మేలగు కార్యములన్ ఘటించ దా
మొప్పగురీతి మిత్రులయి యొక్క పథంబున నుండనేర్తురో!
ఇప్పటితీరు జూడనది యెప్పుడు కాగలదో యెరుంగ మీ
తిప్పలు తీర్చియార్చగల ధీరుని నెంచు సుబుద్ధి గల్గుతన్! ॥ 2

చం. మనసున మర్మముంచి తమ మాటలు కోటలు దాటి జెప్పుదు
ర్జనులకు దూరముండి సహజానుగతంబగు సూక్తులన్ విన
న్ననువగురీతి జెప్పు స్వయమాచరణాత్మకులైన గొప్ప స
జ్జనులకు సాయమిచ్చి తము సంస్కరణానిరతుల్గ జేనగున్ ॥ 3

ఉ. వ్యక్తిని వెక్కిరించుట, నయాచితవ్యాఖ్యల దువ్వుటన్, మరిన్
రిక్త ప్రయోజనంబులకు రేపటి సారథియై చరించుటన్,
యుక్తిగ వైరులం దతిశయోక్తులు జల్లుటయున్, ప్రలోభముల్
రక్తిఘటించురీతి నతిరమ్యముగా మదినిండ బల్కుటన్,
భక్తి నటించుటన్, ప్రజల భారము నాదనుటన్ కుయుక్తులౌ! ॥ 4

## ఎన్నికల కలలో - ఎన్ని కలకలలో!

మ. కలలో కల్లలొ కల్లలో కలలొ కాగన్నేటి కాలానికిన్
కలిగె న్నొక్కవకాశమున్ గలలు సాకారంబులై కానగన్,
కలికాలంబున చేతికందిన వరంగా దల్చి శోధించి ముం
దలవోకన్ గెలిపింప ధీరునొకని న్నాదర్శమూర్తిన్ ఘనున్! || 5

తే.గీ. మాట నప్పక తమకున్న మైత్రి వదలి
వేరె పక్షంబువారల చేరి యొక్క
కూటమిని గూర్చి యెత్తైన కోటగోడ
కూల్చ నుత్సాహపడుటేమి క్రొత్త కాదు ॥ 6

బండ్లు నోడలు నోడలు బండ్లు జేయ
ముందు మంతనముల్ జూడ ముచ్చటౌను!
సాగు యత్నములన్ గొనసాగనిచ్చి
యువత శక్తిని పెంచి చేయూత నిచ్చి
ప్రజల నమ్మకబలముతో ప్రగతి పథము
దేశ మెల్లెడ భాసిల్లి దిక్కులదిరి
వైరులకు "ప్రక్కలోబల్లెమౌర"నంగ
దిగ్గజంబైన నొక్కని తీరు దిద్ది
శకినంతయు పూడ్చి విశ్వాసముంచి
చేతి కీవలె భారత జై పతాక! || 7

తే.గీ. దేశ సౌభాగ్యకాంతులు దిశలు దాటి
భారతీయుల కీర్తి సంపత్తి పెంచి
విశ్వమంతయు నొక్కగా విస్తరింప
జేయు ధీరుని రంజిల్ల జేయు టొప్పు || 8

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)

## పోచినపెద్ది మురళీ కృష్ణ



### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రథమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.

(గత సంచిక తరువాయి)

కైలాసపర్వతాన్ని విడిచి పెట్టి పరమేశ్వరుడు భూమిపై నివశించిన ప్రదేశము, కాశీనగరం కంఠ సీమయందు ముత్యాలహారంలాగ ఉన్న గంగానది ప్రవహించు ప్రదేశము, ఆకలితో బాధపడుతున్నవారికి భిక్షపెట్టు పార్వతీ దేవి నివశించు ప్రదేశము, ఢుంఠి వినాయకుడు నివశించు ప్రదేశము, సంయమీశ్వరులు నివశించు ప్రదేశము అయిన కాశీనగరంలో భిక్షాన్నం లభించకపోవడానికి ఏమి కారణమో అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో సంధ్యారాగపు వర్ణములో ఉన్న పట్టుచీర కట్టుకొని, తల ముడిలో పూలు ముడుచుకొని, కస్తూరితో కలిపిన శ్రీగంధాన్ని అలముకొని, ముత్యాల చెవి కమ్మలు పెట్టుకొని, పాపిటయందు చేర్చుక్క పెట్టుకొని, ముంగురులపై చిన్నిపూవు అను నగను పెట్టుకొని, పాదములకు బంగారు పట్టీలు పెట్టుకొని, నడుమునకు వజ్రాల వడ్డాణము ధరించి, మధ్యాహ్న సమయమునందు పార్వతీదేవి అన్నపూర్ణ, విశాలాక్షి, అనుపేర్లతో అతిధులకు దివ్యాన్నాన్ని వడ్డిస్తూ ఉంటుంది. మనంకూడా అతిథులకు భిక్ష పెడుతూనే ఉన్నాము. ఈ రోజు ప్రారబ్ధ కర్మ వలన అతిధులకు భిక్ష పెట్టలేక పోయాము, అని కాశీ నగరంలోని పురంధ్రీమణులు బాధపడసాగారు.కాశీ నగరంలో ఉండేవారందరు పరమశివులే, అందరు పార్వతులే. బ్రహ్మ నివాసమయిన సత్యలోకం కాశీకి దిగతుడుపే. వైకుంఠమును కాశీకి కుదువ పెట్టవచ్చును. ఇంద్రలోకము, చంద్రలోకము కాశీనగరానికి దాసబృందము వంటివి. ఆదిశేషుడు రాత్రి సమయమునందు తన వేయి పడగల మణుల కాంతులతో శివునికి నివాళి అర్పిస్తాడు. కల్పవృక్షాలు ఫలపుష్పాలతో అర్చిస్తూ ఉంటాయి. కామధేనువు తన పాలతో శివునికి అభిషేకం చేస్తూ ఉంటాయి.

(ఇంకా ఉంది)

# తుమ్మూరి రాంమోహన్ రావు



## తెలంగాణా మహానుభావులు

### 6. రైతు రామాయణ కర్త 'రైతు వాల్మీకి' శ్రీమాన్ వానమామలై జగన్నాథాచార్యులు

"తలదాచుకొనుటకు తగు నీడయును లేని
యొక చిన్న గుడిసె వారుండు వసతి
ఆదాయమది రోళ్ల అడుగునబడియున్న
యొక కొన్ని గింజల నూడ్చికొనుటె
భార్యయా తానొక పరమ సాధ్వీమణి
యిలుదాటి పొరుగిల్లు నెరుగదెపుడు
మానమ్ము గాపాడుమాత్రపు జినుగుడు
పేలికే వారికి చాల కరువు
ఇట్టి కష్ట జీవనముననేని నాథు
ననదు పల్లెత్తు మాటయునైన యెపుడు
పతిపదారవిందములె శ్రీపతిపదార
విందములటంచు లక్ష్మినా వెలసె భువిని
వరదగురు గృహలక్ష్మి కార్పాసలక్ష్మి"

మూడు దశాబ్దాల తరువాత రాయబోయే రైతురామాయణానికి ఇది బీజసదృశంగా కనిపిస్తుంది.ఇదీ వీరి కొన్ని ఇతర రచనలు అలభ్యాలు.

ఇక రైతురామాయణానికి వస్తే,ఆరు కాండలతో మూడువేల పద్యాలతో కూడిన ప్రబంధం. దాదాపు రెండు దశాబ్దాలు సాగిన ఈ రచన తొలుత నాలుగు వేల పద్యాలతో రూపొందినా మూడు వేలకు కుదించబడింది.స్వంతంగా ముద్రించుకునే ఆర్థిక స్థోమత లేక చాలాకాలం ముద్రణకు నోచుకోలేదు.

దండేపల్లి గ్రామ సర్పంచ్ సర్వదేవభట్ల దుర్గయ్య గారు వారి తోబుట్టువు మరణించిన సందర్భంగా ఆచార్యులవారు గరుడపురాణంచెబుతూ సందర్భోచితంగా చదివిన రైతురామాయణ పద్యాలు విని,అది ప్రచురణకు నోచుకోలేదని తెలిసి దానికై సంకల్పించారు.ఆయన అప్పట్లో కరీంగర్ జిల్లా గ్రామాధికారుల సంఘం అధ్యక్షులుగా ఉండటం,కోరుట్లలో వరదాచార్యుల సన్మాన సభలో వీరి పద్యాలువిని యున్నఆనాటి జిల్లా కలెక్టరు శ్రీ కే.యస్.శర్మ గారు వారికి

సంపూర్ణ సహకారాన్నందించటంతో 1980 లో కృతి వెలుగు చూచింది.నాడు భారత విదేశాంగ శాఖామాత్యులుగా ఉన్న శ్రీయుతులు పి.వి.నరసింహారావుగారికి ఇది అంకితమీయబడింది.



శ్రీ వానమామలై జగన్నాథాచార్యులు

రైతును కథానాయకునిగా చేసి, రామాయణ కావ్య స్ఫురణతో,ఆనాటి తెలంగాణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణా ఆత్మగౌరవం చాటి చెప్పేదిగా,నైజాము విమోచనోద్యమం, రజాకార్ల దురాగతాలను కళ్లకు కట్టినట్లుచూపిస్తూ, తెలంగాణా భాషకు కావ్యగౌరవం కల్పిస్తూ ,అనేక తెలంగాణా మాండలిక పదాల నిధిగా తీర్చి దిద్దుతూ, అన్నిటికంటే ప్రధానంగా అన్నదాత అభ్యుదయాన్ని కాంక్షిస్తూ,రైతుల సాధకబాధకాలను ఏకరువు పెడుతూ,రావణాసురుని బోలిన ప్రజాకంటకుడు పాపారావు వంటి ధూర్త భూస్వాములను ఎలా ఎదుర్కోవాలో చూపించే అనన్య సామాన్య రచన రైతు రామాయణం. ఇంతటి విశిష్ట గ్రంథానికి రావలిసినంత పేరు రాకపోవడం ఆ కవి గురించి చాలా మందికి తెలియకపోవడం తెలంగాణా ప్రజల దురదృష్టం.

శిశుకాండ, శిక్షణకాండ, కళ్యాణకాండ, కృషి కాండ, నిర్బంధ కాండ,విజయ కాండ అని రామాయణంల వలెనే ఆరు కాండలతో అలరారింది ఈ కావ్యం.

వస్తువు కల్పితమేయైనా అప్పటి కాలానికి తగినట్లుగా తీర్చి దిద్దటంతో వాస్తవికతను సంతరించుకున్నది.స్థూలంగా కథ- తెలంగాణాలోని రామగిరి ప్రాంతంలో రామాపురం అనే గ్రామం నేపథ్యంలో జరిగినట్లుగా చెప్పబడింది.

చదువుతుంటే రామాయణం లోని సన్నివేశాలు పాత్రలు స్ఫురించే విధంగా ఆధునిక పరిస్థితుల కనుగుణంగా కథను మలచడంలో కవి ప్రతిభ కనిపిస్తుంది.ప్రబంధ ప్రామాణికత- కోసం, కావ్య సౌందర్యం కోసం అష్టాదశ వర్ణలను,ఇతర కావ్యాలకు దీటుగా నాటకీయత, ధ్వని, అలంకార శోభలను కూర్చి పండిత పామరులందరినీ సంతృప్తి పరచే విధంగా జనరంజకకావ్యంగా మలచిన జగన్నాథాచార్యులు కారణజన్ములనక తప్పదు. ముఖ్యంగా రైతు రామాయణం తెలంగాణా నుడికారాలతో,జాతీ యాలతో ,సామెతలతో పాటు అనేక వ్యవసాయ సంబంధమైన పదాలను పొందుపరచడంతో తెలంగాణా పదకోశంగా కూడా ప్రశస్తిని కలిగి ఉంది.తెలంగాణాలోని అన్ని వర్ణాల వారి ఆచారవ్యవహారాలు, సంప్రదాయా-

లు, కట్టుబాట్లు,ఉత్సవాలు, పండుగలు ఒకటేమిటి డెబ్బయి యేండ్ల కిందటి తెలంగాణాను దృశ్యమానంగా మలిచిన ఆచార్యులవారు అభినందనీయులు. కాకపోతే రైతు రామాయణ పుస్తక ప్రచురణ కొన్ని అనివార్య పరిస్థితుల్లో హడావుడిగా ప్రచురింపబడి ముద్రారాక్షసాలు అడుగడుగునా బాధిస్తాయి. తెలంగాణా ఏర్పడి ముందుకు వెళుతున్న ఈ సందర్భంలో లోపరహితంగా పుస్తకాన్ని వెలుగులోనికి తేవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇన్ని చెప్పుకుని ఇందలి పద్యాల రుచి కొంతైనా చూడకపోతే ఏం బాగుంటుది? కథానాయకుని వర్ణిస్తూ-

'మేలిమీసపుకట్టు నుంగ్రాల జుట్టు
కచ్చబోసిన ధోవతి కట్ల నెడమ
మూపుపై వలెవాటుగా మునువెనుకల
వ్రేలు పట్టుసెల్లా చమికీల బెట్టు '
వెలయు గారాల బిడ్డ యే సలుపు లేని
దొడ్డకాపువంశపు రెడ్డిబిడ్డ,మంచి

తెలంగాణా కాపును బొమ్మ గీసినట్టుచూపిస్తారు. అలాగే ప్రతినాయకుని వర్ణిస్తూ-

'నాలుక తెగిపోవునంతటి చిరు చేదు
నాగుబాము విషమ్ము తాగు కల్లు
పచ్చిమసాల ద్రవ్యాలతో వేపిన
నంజుడు ఖైమాలు నాల్క చవికి
మడతరొట్టెలపైకి మరిగిన సోరువ
మట్టమున్న మేల్రవలనేయి
సానికాటుకల వాసన బువ్వ యెత్తుకె
త్తాయసాయాల కూరంచులందు
పచ్చిమీగడ పెరుగులు పచ్చిపాలు
పప్పు భక్ష్యాలు చక్కని పాయసాలు
పచ్చకప్రపు విడెములు పట్టుపాన్పు
లచ్చరలవంటి జవ్వనులా దొరకవి
నిర్నిబంధ కాలక్షేప నిత్య విధులు'

'కథానాయిక సీతను ఇలా వర్ణిస్తారొకచోట

**చురుకయినపిల్ల యపరంజి మెరుపు తడల**
**చూపఱ కనులలోన జొచ్చుకొనిపోవు**
**జిగిమెరుపుల తారాజువ్వ;చెప్పరాని**
**స్వాభిమానమ్ములు గల సీతవ్వ తాను'**
ఇలా ఉదహరిస్తూ పోవడం గ్రంధవిస్తరమవుతుంది.

ఈ ప్రజాకవికి రావలసినంత పేరు రాకపోయినా వేయికి పైగా హరికథలు చెప్పిన వీరికి పలు సన్మానాలు జరిగాయి.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో జరిగిన మహా కవి సమ్మేళనంలో వీరి పద్యాలు విని తన్మయులై ప్రశంసల జల్లులు కురిపించారు.

నెల్లూరులోని "తెలుగు పద సాహిత్య సమితి" వారు రైతు రామాయణ కావ్యాన్ని మాండలిక పదకోశంగా ప్రశంసించి సంస్థ అధ్యక్షులైన మరుపూరి కోదండరామిరెడ్డిగారు ఐదువందల రూపాయలు దేవులపల్లి రామానుజరావుగారి ద్వారా అందజేశారు.

సాహిత్య అకాడమీవారు ఈ కావ్యాన్ని ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలో 1984 సంవత్సరానికి ఉత్తమమైందిగా ఎంపికచేసి రూ.2500/- పారితోషికంగా ఇచ్చారు.

నన్నయ జయంతి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ కళాభారతి వారు నూటపదహార్లతో పండిత సన్మానం చేశారు.

'నీ కొత్త పదాల వాడుక నన్ను ముగ్ధుణ్ని చేసింది. నీ కావ్యం నిలిచి ఉంటుంది' అని ప్రశంసించారట కవి సమ్రాట్ విశ్వనాథ,కరీంనగర్ కళాశాలలో ఆయన ప్రిన్సిపాలుగా ఉన్నప్పుడు జరిగిన కవి సమ్మేళనంలో ఆచార్యులవారి పద్యాలు విని. మరోమారు ఆయనే జమ్మికుంటలోజరిగిన సాహితీ సమావేశంలో రైతురామాయణ పద్యాలను విని 'కవిత్వంలో వరదాచార్యులు ప్రసిద్ధి పొందారు, జగన్నాథాచార్యులవారు సిద్ధి పొందా'రని అభినందించారు.

తమ్ముడే అయినా జగ్గన్న, వరదన్నను మహాకవిగా భావించేవారు.అందుకే ఆయన ఇచ్చిన 'రైతువాల్మీకి' బిరుదును ఒక మహాకవి బహూకృతిగా సవీకరించారు.

రైతురామాయణంలో నాటి ప్రసిద్ధకవులైన కాళోజీ,దాశరథి, సినారె, తమ్ముడు వరదాచార్యులు, అన్న వేంకటాచార్యుల ప్రశంసలున్నాయి.

19 డిసెంబరు 1908 లో జన్మించిన శ్రీమాన్ వానమామలై జగన్నాథాచార్యులవారు సంగీత సాహిత్యాలతో సరస్వతిని మెప్పించి, సామాజిక స్పృహతో సరసజ్ఞులను ఒప్పించి, జీవితం ధన్యంచేసుకుని 87 వ ఏట 28 జూన్ 1995 నాడు చిరకీర్తితో పరమపదించారు.

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు





# SPOKEN SANSKRIT

+91 9897959425

## (సంభాషణ సంస్కృతం -27)

**Unit 1.** सप्तमीविभक्ति: **Locative case**

( अधिकरणार्थे )

अधिकरण **means the base or substratum . The word which denotes base or substratum is called Adhikarana and it is in Locative case. It is in Locative case because it speaks of the location of a particular thing.**

ఇది ఏడవ విభక్తి. ఇది అధికరణ కారకమునందు వాడెదము. అధికరణం అంటే ఆధారం. ఈ ప్రపంచమంతా ఆధార ఆధేయ భావంతో కూడి యున్నది. ఒక వస్తువునకు మరొక వస్తువు ఆధారం. ఏ వస్తువునకు ఏది ఆధారమో అది సప్తమీ విభక్తిలో ఉంటుంది. ఈ ఆధారం ఔపశ్లేషికం, వైషయికం, అభివ్యాపకం అని మూడు విధాలుగా ఉంటుంది. ఔపశ్లేషికం అంటే సమీపసంబంధం కలది. ఉదాహరణకు ఘటే జలం అస్తి 'కుండలో నీరు ఉన్నది' అనే వాక్యంలో కుండ ప్రక్కనే నీరు, నీటి ప్రక్కనే కుండ. నీరు ఆధేయం కుండ ఆధారం. కుండకు సప్తమీ విభక్తి రాగా కుండలో నీరు ఉన్నది ఘటే జలం అస్తి అనే వాక్యం ఏర్పడింది.

రెండోది వైషయికం అంటే విషయసంబంధం గలది. ఉదాహరణకు 'మోక్షే ఇచ్ఛా అస్తి ' మోక్షమందిచ్ఛ కలదు. అనే వాక్యంలో ఆ ఇచ్ఛ మోక్ష విషయకమైనది. అందువల్ల మోక్షపదానికి సప్తమీవిభక్తి వచ్చింది. మోక్షే ఇచ్ఛా అస్తి. అనే వాక్యం ఏర్పడింది. మూడోది అభివ్యాపకము. అంటే అంతటా నిండినది. 'సర్వస్మిన్ ఈ శ్వర: అస్తి' అన్నిటియందు ఈశ్వరుడు ఉన్నాడు అనే వాక్యం ఏర్పడింది ఇక్కడ అంతట అనే అర్థాన్ని సూచించే 'సర్వస్మిన్ అనే పదం సప్తమీవిభక్తిలో ఉంది. 'సర్వస్మిన్ ఈశ్వర: అస్తి' అనే వాక్యం ఏర్పడింది.

**1.** जलं घटे अस्ति

**Water is in the pot**

**2.** लेखनी कोशे अस्ति

**Pen is in the pocket.**

3. माता गृहे अस्ति
**Mother is in the house.**
4. पिता कार्यालये अस्ति
**Father is in the office**
5. सीतारामौ पर्णशालायां निवसत:
**Rama and Sita are in a hut.**
6. रामलक्ष्मणौ गुरुकुले स्त:
**Rama and Lakshmana are in a Gurukula**
7. कृष्णार्जुनौ कुरुक्षेत्रे तिष्ठत:
Krishna and Arjuna are in Kurukshetra .
8. बालका: कळाशालायां सन्ति ||
**Boys are in the college.**
9. बालिका: ग्रन्थालये सन्ति ||
Girls are in the library.
10. पण्डिता: वेदिकायाम् उपविशन्ति ||
Scholars are on the dais

नौका समुद्रे अस्ति
Ship is in the sea
मीन: जले अस्ति
Fish is in the water
सूर्य आकाशे अस्ति
The Sun is in the sky
वृक्षे पलानि सन्ति
Fruits are in the tree
सीतारामौ वने स्त:
Sita and Rama are in exile
भीमार्जुनौ रणे स्त:
Bheema and Arjuna are in the battle field

मुखे नेत्रे स्त:
पद्मे सौरभम् अस्ति
ग्रन्था: पुस्तकालये सन्ति
बीजं फले अस्ति
कनीनिका नेत्रे अस्ति

The eye ball is in the eye

Unit II. आसक्त्यादीनां विषयत्वेन

**ఆసక్తి, ప్రీతి, అభిరుచి, స్నేహం, విధేయత, జుగుప్స, కోరిక, అనాదరం, నిరాసక్తి, అత్యాసక్తి, అనాసక్తి, కుతూహలం, మొదలైన పదాలు ఉపయోగించినప్పుడు వాటికి సంబంధించిన విషయాలను సూచించే పదాలకు సప్తమీ విభక్తి చేరుతుంది.**

बालकस्य क्रीडायाम् आसक्ति: अस्ति
**బాలునకు ఆటలలో ఆసక్తి కలదు**

पण्डितस्य विद्यायां प्रीति: अस्ति
**పండితునకు విద్యపట్ల ఇష్టము కలదు**

स्त्रीणां नाट्ये अभिरुचि : अस्ति
**స్త్రీలకు నాట్యము పట్ల కోరిక ఉండును**

कुचेलस्य कृष्णे स्नेह: अस्ति ||
**కుచేలునకు కృష్ణుని యందు స్నేహం కలదు .**

धार्मिकस्य अधर्मे जुगुप्सा अस्ति
**ధర్మాత్మునకు అధర్మం పట్ల అసహ్యం కలుగును**

मूर्खाणां कलहे इच्छा अस्ति ||
**మూర్ఖులు కలహించుట యందు కోరిక గలవారు .**

आतिथेयस्य अतिथि सत्कारे विषेषादर: अस्ति ||
**గృహస్థునకు అతిథి సత్కారమునందు విశేషమైన ఆదరము ఉండును**

शिष्यस्य वेदपठने श्रद्धा अस्ति
**శిష్యునకు వేదం చదువుటలో శ్రద్ధ కలదు .**

पुत्रस्य पितरि नम्रता अस्ति
**పుత్రునకు తండ్రి యెడ విధేయత కలదు**

बालकस्य कथाश्रवणे इच्छा अस्ति
**బాలునకు కథలు వినుటలో ఆసక్తి ఉండును.**

సప్తమీ విభక్తి ఏకవచన, ద్వివచన, బహువచనములలో ఈ క్రింది విధంగా ఉండును.

**అకారాంత పుంలింగం :**

रामे –रामयो:- रामेषु

बालके –बालकयो:- बालकेषु

**అకారాంత నపుంసక లింగం :**

मित्रे –मित्रयो:-मित्रेषु

पुस्तके –पुस्तकयो:- पुस्तकेषु

**ఇకారాంత పుంలింగం**

हरौ – हर्यो: - हरिषु

कवौ – कव्यो : - -कविषु

**ఉకారాంత పుంలింగం**

गुरौ – गुर्वो: -- गुरुषु

**ఆకారాంత స్త్రీలింగం :**

रमायां –रमयो: =रमासु

गुहायां –गुहयो: -गुहासु

**ఈ కారాంత స్త్రీలింగం**

गौर्याम्- गौर्यो:-गौरीषु

नद्याम्- नद्यो: नदीषु -

**SANSKRIT SLOKA**

बालस्तावत्क्रीडासक्त: तरुणस्तावत्तरूणीसक्त:

वृद्स्तावच्चिन्तासक्त: परमे ब्रह्मणि कोऽपि न सक्त:

**( A sloka from Bhajagovindastotra of Sri Sankaracharya )**

**A child is always interested in plays or playing. A young man is interested in beautiful ladies. An old man is always engaged with grief or attached in thinking about something. But no body is interested in Parabrahma, The Ultimate Reality .**

బాలుడు ఎల్లప్పుడూ ఆటల పట్ల ఆసక్తి కలిగి ఉంటాడు . యువకుడు ఎల్లప్పుడూ అందమైన యువతు-లపట్ల ఆసక్తి కలిగి ఉంటాడు. వృద్ధుడు ఎల్లప్పుడూ చింతామగ్నుడై ఉంటాడు . కాని పరబ్రహ్మ యందు మనస్సు లగ్నము చేయు వారు ఎవరును లేరు.

# ఆదూరి హైమవతి



## పసిడి మనసులు

"ఓరేయ్! పిల్లలూ! ఈరోజు డిసెంబరు 31 వతేది. ఈరోజుతో ఈ సంవత్సరం పూర్తై రేపటి నుంచీ కొత్త సంవత్సరం మొదలవుతున్నది కదా! మీరు మరో 4 నెలల్లో పై తరగతులకు వెళ్ళ బోతున్నారు. మరి మీరు ఒక్కోరూ లేచి ఏం చదువులు చదివి ఏ ఉద్యోగాలు చేయదల్చుకున్నారో చెప్పాలి. కొత్త ఏడాదిని కొత్త ఆలోచనలతో మొదలెట్టాలి మరి, మీ లక్ష్యాన్ని నిర్ణయించుకుని? ఆవైపుగా మీ అడుగులు వేయాలి. రామూ నీవు మొదలు పెట్టు ముందు" పెద్దపంతులు రామూ వైపు చూసి మాటలు ఆపగానే వాడు లేచాడు.

"మా నాయనగారు నన్ను ఒక పెద్ద డాక్టర్లు చేయాలనుకుంటున్నారు పంతులుగారూ! రోజూ మా అమ్మతో చెప్పడం నేను వింటుంటాను. “

"ఎందుకని అలా అనుకుంటునారో తెల్సానీకు?"

"పంతులుగారూ! డాక్టరైతే, ఎంచక్కా బోలెడంత డబ్బు సంపాదించ వచ్చుట! కడుపునొప్పని వచ్చినవారికి, 24 గం. నొప్పని భయపెట్టి, ఆపరేషన్ చేసి వేలు వేలు బిల్లు వేయవచ్చుట. అందుకనీ నన్ను డాక్టర్లు చేసి నేను సంపాదించే ఆడబ్బుతో నగరంలో పెద్ద బంగళాలు కట్టిస్తారుట!" అమాయకంగా చెప్పాడు రామూ.

"మరి నీ మాటేంటోయ్! మాధవ్!"

"పంతులుగారూ మా నాయన నన్ను పెద్ద లాయర్లు చేసేయాలని మా అమ్మతో రోజూనూ అంటూంటారు."

"ఓహ్ అలాగా! ఎందుకో నీకేమన్నాతెల్సా?”

"ఆహా! విన్నాగా! లాయరైతే ఒక్కో కేసూ ఐదు నుంచీ పదేళ్ళు నడిపి ఊరికే బోలెడంత ఫీజు వసూలు చేసేయొచ్చుట! వాళ్ళని వీధుల్లో అడుక్కునేలా చేయచ్చుట.

దాంతో మేం పెద్ద పెద్ద మేడలూ కట్టుకోవచ్చుట" చేతులు త్రిప్పుతూ అమాయకంగా చెప్తున్న మాధవుడ్ని చూసి నవ్వి, పంతులు గారు "మరీ నీవో ఆనంద్!" అన్నాడు.

ఆనంద్ లేచి "పంతులుగారూ! మానాయన నన్ను ఇంజనీర్ను చేస్తారుట! బిల్డింగులూ, ప్రాజక్టులూ కట్టి డబ్బుదోచుకో వచ్చుట, సిమెంటుకు బదులుగా బూడిద కలపవచ్చుట. ఇంకా.." సిగ్గుపడుతూ తలవంచుకున్న వాడిని చూసి, పంతులుగారు "చెప్పవోయ్! సిగ్గెందుకూ?.." అన్నాక,

"మరీ మరీ నా పెళ్ళప్పుడు మరింత కట్నం తీసుకోవచ్చుట!" అన్నాడువాడు. తరగతిలో పిల్లలంతా ఫక్కున నవ్వారు.

"సరి, మరి నీమాటేంటోయ్ వాసూ!"

"పంతులుగారూ మా అమ్మ నన్ను ఒక పెద్ద పోలీసాఫీసర్ను చేస్తుందిట! అప్పుడు ఎంతో మంది నన్ను చూసి భయ పడతారుట! చాలామంది కేసులు తప్పించమని డబ్బుతెచ్చి ఇస్తారుట!" అంటూ చాలా ఉత్సాహంగా చెప్పాడు వాసు.

పిల్లలంతా "అబ్బో పోలిసాఫీసర్ ! సలాం " అంటూ ఎగతాళి చేశారు.

"నీ విషయమేంటిరా నాగరాజూ!"

" పంతులుగారూ ! నావంటికి ఈ చదువంటే పడదుట! అందుకనీ కాస్త హైస్కూల్ దాకా వచ్చాక మానాయన చేసే సరుకుల వ్యాపారం నాకు అప్పజెపు తారుట! బియ్యం లో చెత్త, రాళ్ళూ కలప వచ్చుట! నూనెలో బాగా కల్తీ చేయవచ్చుట! ఏ ఉద్యోగం చేసినా ఇంత లాభం రాదుట!" అన్నాడు నాగరాజు.

మరికొందరు అబ్బాయిలు కాంట్రాక్టర్ల మవుతామనీ, మినిస్టర్లమవుతామనీ, ఎం.ఎల్.ఏ ల మవుతామనీ రకరకాలుగా చెప్పారు.

(47 వ పేజీ చూడండి)

# పమ్మి భారతీ శర్మ



## కలికాలం ముచ్చట్లు

అమ్మా, నాన్నా ఓల్డేజి హోమ్ లో, పిల్లలు క్రెచ్ లో, పెంపుడు కుక్క పప్పీ మాత్రం పక్కలో - కలి కాలం ముచ్చట్లు!

ప్రేమలు పీటల దాకా వస్తున్నాయో లేదో తెలీదు కానీ పీకలు తెగేదాకా వస్తున్నాయి.

1980, 90 దశకాల్లో అత్యంత ప్రమాదకరమైన, పిల్లల చదువులు పాడుచేసే వస్తువు టి.వి. అనుకునేవారు.......టెక్నాలజీ అరచేతిలోకి రాగానే టి. వి. చూడ్డం, అత్యంత ఆరోగ్యకరం అంటున్నారు పెద్దలు.

పూర్వం ఒక్కడే ఫ్యామిలీకి డాక్టరు...... ఇప్పుడు అవయవానికో డాక్టరు. కలికాలం ముచ్చట.

తమ్ముడి కొడుకులు, ఆడపడుచు గారి పిల్లలు మన ఇళ్లకొ- స్తే మొహం అదోలా పెట్టేసుకుంటున్నాం.... స్విగ్గీ, జొమేటో పిల్లల కోసం వళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురుచూస్తున్నాం.

తినే చపాతీ ఖరీదు తక్కువే. జుట్టుకి వేయించుకునే రంగు ఖరీదు మహా ఎక్కువ.

వార్తల్లో పస లేదు. చంపుకోడాలు, కిడ్నాపులు..దొంగతనాలూ మామూలు వార్తలే........ నెట్వర్క్ ప్రాబ్లంలో రెండు రోజులు ఫోన్లు, వాట్సప్ లు పనిచేయవు అనే వార్త అత్యంత ప్రమాదకరం, ఘోరం, భయానకం.... కలికాలం ముచ్చట.

గ్రాము బంగారం ధర మూడువేలైతే... మాయ బంగారం నగలు అయిదు వేలదానికే ధగధగలు ఎక్కువ.... ఫ్యాషన్ల కొత్త పోకడలు.. చీర కి మూడొందలు, రవిక వర్క్ కి వెయ్యి రూపాయలు. అయోమయం సంత.కలికాలం ముచ్చట.

మగవాళ్ళకి ఎదగని జుట్టు.... తలలంతా బట్టతలలు. ఆడవాళ్ళకి పెరిగే అవాంఛిత రోమాలూ ... కలికాలం ముచ్చట. కట్నాలు తీసుకోము... అన్న పెళ్ళిళ్ళకే ఖర్చులు ఎక్కువ. డాక్టర్లు టెస్టులు రాసేస్తున్నారు.... డాక్టర్లు కానివా ళ్ళంతా రోగాలను తగ్గించేస్తున్నారు. ఉద్యోగంలేని ఆడపిల్ల, వంటరాని మగాడు ఇద్దరూ ఫెయిల్ అయ్యారు... పెళ్ళిచూపులలో పూర్వకాలం పలకరింపులు... ఏం అమ్మాయ్?కులాసానా.. పిల్లలు బావున్నారా? మీ అత్తయ్య, మామయ్యా బావున్నారా? ఆ పలకరింపులు ఇప్పుడు మారిపోయాయి.

బాగా సన్నబడ్డావు... ఎవరి డైట్ ఫాలో అవుతున్నావు? ఎన్.ఆర్.ఐ. కొడుకు విదేశంలో స్నేహితులతో కూర్చుని బడాయి కబు ర్లు... మా అమ్మా..నాన్న తల తాక ట్టు పెట్టి నన్ను చదివించార్రా... అందుకే ఇప్పుడు వాళ్ళకో డూప్లెక్స్ ఇల్లు కొనిచ్చా. .. ఇక్కడ మంచం మీంచి లేవలేని తండ్రి .. వీల్ చెయిర్ లో తల్లి ...

కలికాలం ముచ్చట్లు!
మనకాలం ముచ్చట్లు!

# అత్తాపూర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

డా. కవిత (సైకాలజిస్ట్ ) అంతర్జాతీయ మహిళా దినోత్సవం అత్యంత వైభవంగా హైదరాబాద్ అత్తాపూర్ లో నిర్వహించారు. డా.కవిత (సైకాలజి) ఎంతోమంది మహిళలకు యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, కౌన్సిలింగ్, వంటి ఎన్నో క్లాసెస్ నిర్వహించడమేకాక, వారందరి అభిమానాన్ని పొందడం నిజంగా హర్షించదగ్గ విషయం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం లో భాగంగా కేక్ కటింగ్ చేసారు.



# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

ముతక నేత అంటే మగ్గంలో కాకుండా చేత్తోనే నేసేవారు. అందుకే బాగా బరువుండేవి చీరలు. నేటితరం సుకుమార కన్యలు ఈ చీరలు మోయటం కష్టం.

### పండుగలు

పల్లెటూళ్ళలో పండుగలు కుల మతాలకు సంబంధం లేకుండా జరుపుకుంటారు. మా ఊర్లో కూడా అంతే. చాలావరకు పండుగలు వ్యవసాయానికి అనుబంధంగానే వుండేవి. కొన్ని ముఖ్యమైన పండగల గురించి ప్రస్తావిస్తాను. ఉగాది, శ్రీరామనవమి, దీపావళి, మొలకలపున్నమి, అంకాలమ్మ తిరుణాల, పోలేరమ్మ పోతురాజుల ఆరాధన, ఇలా వుండేవి. పీర్ల పండగ ప్రత్యేకం.

**ఉగాది పండుగ - ఏరువాక**

ఈ పండుగరోజు అందరు ఆత్రంగా ఎదురుచూసేది సాయంత్రం అయ్యాక, పంచాంగ శ్రవణం. పిండివంటలు ఎవరికి తోచినట్లు వారు చేసుకున్నా సాయంత్రం మంచి ముహూర్తం చూసుకుని ఏరువాక సాగటానికి వెళతారు. అంటే వ్యవసాయపు పనులు ప్రారంభించే మొదటి రోజన్నమాట. అంతవరకూ అలసట తీర్చుకున్న రైతన్న, ఆయన కుటుంబ సభ్యులు తరువాతి సంవత్సరానికి తయారవ్వడం అన్నమాట. ఎద్దులను ముందు అలంకరించి, పూజించి, కాడి కట్టి పొలంలోకి తీసుకెళ్ళి, టెంకాయ కొట్టి నాగలి చాలు ప్రారంభిస్తారు. నాలుగైదు కొండ్రాలు మాత్రమే తిప్పి తీసుకొస్తారు. ఎద్దులు లేనివారు గొడ్డలి భుజాన వేసుకుని పొలంలో మొలిచిన నాలుగు కంపచెట్లను కొట్టి ఏరువాక కానిచ్చేవారు. చీకటిపడ్డ తరువాత అందరూ రామాలయంలో చేరుతారు. అప్పుడే ఆ సంవత్సరం 'పంచాంగం' వచ్చివుంటుంది కాబట్టి పంచాంగ శ్రవణం మొదలౌతుంది. గ్రహచార స్థితిని బట్టి ఆ సంవత్సర ఫలితాంశాలు ముందు వెల్లడిస్తారు.

ఆర్థిక పరిస్థితి, పంటల పరిస్థితి, వర్షాలు, గాలి, ప్రకృతి వైపరీత్యాలు వీటి గురించి విస్తారంగా ప్రస్తావిస్తారు. ముఖ్యంగా పంటల్లో ఏ ఏ పంటలు ఈ సంవత్సరం బాగా పండుతాయో, ఏ పంటలకు అనుకూలంగా వుండదో, పశుసంపదకు, పాడి పశువులకు అధిపతి ఎవరో, అనారోగ్య పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తారు. ఏ పంటలు బాగా పండుతాయని పంచాంగంలో వ్రాసివుంటారో ఆ పంటలే రైతులు ఎక్కువ వేస్తారు.

(ఇంకా ఉంది)



# ఎలక్ట్రాన్



## గమ్యం

ఉయ్యాల రంగనాధరావు ఇంజనీరింగ్ డిగ్రీ చేతబట్టుకొని, కిందా మీదా పడి, అమెరికా వెళ్ళి, ఓ పై మెట్టు డిగ్రీ సాధించి, బెంచీలమీద కూర్చుని, చిన్నాచితకా ప్రాజెక్టులు చేసి, చివరికి స్థిరమైన ఉద్యోగం సంపాదించి, ఏడాది శ్రమపడి పనిచేసి, కంపెనీ వారిచేత అవుననిపించుకొని, సెలవుమీద శేషాంధ్ర ప్రదేశంలోని స్వస్థలమైన విశాఖపట్నంలో ఆర్. ఎన్. ఉయ్యాలగా అడుగు పెట్టాడు. జాబితా వేసుకొని ఓ పెట్టినిండా అయినవారికీ, స్నేహితులకీ పలురకాలైన బహుమతులు తీసుకొచ్చాడు. అవన్నీ విశాఖ మహాదుకాణాలలో దొరికే వైనా, చైనా, మలేసియా, హాంగ్ కాంగ్ తయారీలే అయినా, అమెరికాలో డాలర్లతో కొన్నవి కాబట్టి అందుకొన్నవారికి ఆనందంగా ఉంటుంది కదా? బహుమతుల వితరణ జరిగిపోయింది. ఆర్. ఎన్.ఉయ్యాల నాయనమ్మ రంగనాయకమ్మకి తనపేరు కలిసిన ఆఖరి మనవడంటే మహా చెడ్డ అభిమానం. ఉయ్యాల నాయనమ్మకి అయిదోతరం స్మార్ట్ ఫోన్ కానుకగా ఇచ్చాడు.

ఆవిడ తనదగ్గరున్న నాలుగొందల డొక్కుఫోన్ ని పనిమనిషి కిచ్చేసింది. తనదగ్గర రెండు వేలు చేసే ఫోన్ ఉన్నా, పెద్దమ్మ ఇచ్చింది కాదంటే ఏం కొంప మునిగిపోతుందేమోనని భయపడ్డ పనిమనిషి, మహదానందం ప్రకటిస్తూ దాన్నికళ్ళకద్దుకొని తీసేసుకోంది. తొమ్మిదోతరగతి చదివే పనిమనిషి కూతురు "అమ్మగారిచ్చిన ఫోను నీకు చాలు!" అంటూ, ఖరీదుచేసే తల్లి ఫోనుని తీసేసుకొంది.

ఉయ్యాల నాయనమ్మ పక్కన కూర్చుని ఒక్కరోజులో అయిదోతరం స్మార్ట్ ఫోన్ చిట్కాలన్నీ నేర్పేశాడు. ఆవిడ తెలివి తక్కువదేమీ కాదు. పదోతరగతి వరకూ చదువుకొంది. కిటుకులన్నీ సులువుగా అవుపోసన పట్టేసింది. ఫ్యామిలీ అల్బంలోంచి ఫోటోలని నెంబర్లతో జోడించి ఇవ్వడంతో ఆవిడ ఆనందానికి హద్దూ పద్దులేకుండా పోయింది. ఉయ్యాలకి ఇద్దరు మేనత్తలు. చిన్న బాబాయికి భిలాయ్ లో పని. పెద్ద బాబాయికి గాజువాక స్టీల్ ఫ్యాక్టరీలో పని. నాన్న విశ్వవిద్యాలయంలో ఉపన్యాసకుడు. నాన్నా, పెద్ద బాబాయీ డాబాగార్డెన్స్ లోని స్వంత యింట్లోనే ఉంటారు. అభ్యాసము కూసు విద్య అని మనవణ్ణి పక్కన పెట్టుకొని భిలాయ్ కోడలికీ, మనవడికీ, మనవరాలికీ, ఇంట్లోనే ఉన్న ఇద్దరు కోడళ్ళకీ, అందరి-



కంటే ఎక్కువగా పనిమనిషికీ, పై ఊళ్లలో ఉన్న కూతుళ్ళకీ, ఇంకా చాలా చాలామందికి ఫోన్లమీద ఫోన్లు చేసేసి, మూడు రోజుల్లో ప్రావీణ్యత సాధించేసింది.

ఉయ్యాలవారబ్బాయి అమెరికా నుంచి వచ్చాడని తెలిసి ఊళ్ళోని వాళ్లూ, దగ్గర ఊళ్ళలోని వాళ్ళూ పెళ్లికబుర్ల రాయబారాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ జరపడం మొదలు పెట్టారు. దాంతో ఉయ్యాల రంగనాయకమ్మకి బెదురు పట్టుకొంది. ఆవిడ రెండో కూతురి రెండో కూతురు పరిమళ నవనవలాడే రూపంతో పెళ్లీడుకొచ్చేసింది. ఇంజనీరింగ్ ప్యాసైపోయి, కొత్తరాజధానికి దగ్గర్లో తాత్కాలికంగా ఓ రేకులషెడ్డులో నెలకొన్న కృష్ణ ఐటి ఫ్లో అనే మలేసియా భాగస్వామి కంపెనీలో ఉద్యోగంలో చేరింది. చిన్నప్పట్నుంచీ ఏదో ఉబుసులాటల్లో మేనరికం అనుకొంటూనే ఉన్నా అది ఇదమిత్థంగా తేల్చుకోని విషయం. వయసొచ్చిన ఇటు పౌత్రుడు, అటు దౌహిత్రి ఇద్దరూ వారి వారి బాటల్లో ఎవర్నైనా ప్రేమించేస్తారేమో, లేదా యిప్పటికే ప్రేమించేసారేమో అన్న భయం రంగనాయకమ్మకి కలిగింది. వెంటనే మనవణ్ణి డాబామీదకు తీసుకుపోయి నిలదీసి అడిగేసింది. "ఏరా! ఉయ్యాలా? నువ్వు అమెరికాలో ఎవరైనా తెల్లతోలు పిల్లని కానీ, లేదా అమెరికాలో నివసిస్తున్నమన భారతీయుల అమ్మాయినెవర్నైనాకాని ప్రేమించేయలేదు కదా?"




"ఛ! అటువంటిదేమీ లేదు నానమ్మా?" అన్నాడు.

"అయితే! సంబంధాలు వెతకమని నీ అమ్మా నాన్నలని కదిపి చూస్తాను. వాళ్ళు అవునంటే సిద్ధాంతీగారితో చెబ్తాను. నువ్వో ఇంటివాడవై అమెరికా వెడ్తే మాకూ నిశ్చింతగా ఉంటుంది !"

పెళ్లిప్రస్తావన తీసుకొచ్చినందుకు లోలోపల సంతోషిస్తూ, ఉయ్యాల హుషారుగా ఈల వేసుకొంటూ మేడ దిగాడు. రంగనాయకమ్మ కొడుకునీ కోడల్నీ కదిపి చూసింది. "వచ్చినరోజునే వాణ్ని పెళ్ళి గురించి అడిగితే, 'కంగారేముంది?' అని మాట దాట వేశాడు!" అన్నాడు కొడుకు. "పెళ్లిచేసుకొంటావా అని అడిగితే ఏ కుర్రాడైనా అలాగే అంటాడు! అడిగే తీరులో ఉంటుంది. నేను కదిపి చూశాను. సుముఖంగానే ఉన్నాడు. మన సుభద్ర కూతురు పరిమళ ఈడూ జోడూగా ఉంటుంది. అడిగి చూడమన్నావా?"

"అడిగి చూడు. నా బావమరిది కూతురికి ఏనాడో పెళ్లయిపోయింది కాబట్టి ఇటునుంచి పోటీ ఉండదు!" అన్నాడు భార్యవైపు నవ్వుతూ చూస్తూ.

"ఏం చిన్నకోడలా, ఏమంటావు?" రంగనాయకమ్మ స్టీల్ ఫ్యాక్టరీ కోడల్ని అడిగింది.

"నా తమ్ముడింకా చదువుకుంటున్నాడు. వాడు పెరిగి పెద్దవాడై కూతుర్ని కనేసరికి, ఆమె ఎదిగేసరికి, మన రంగాకి అరవైలు దాటేస్తాయి! అందుచేత నా వైపు నుంచీ కూడా అభ్యంతరం లేదు!" అందామె హాస్యమాడుతూ.

"భిలాయ్ కోడలు వాళ్ళ అమ్మానాన్నలకి ఒకర్తే సంతానం కాబట్టి అట్నుంచి కూడా పోటీ లేదు! కనకసుభద్రని అడిగి చూస్తాను." అంది రంగనాయకమ్మ. ఆవిడ చాలా జాగ్రత్త మనిషి. అన్నివి-

ధాలా ఆలోచించి, వేగంగా కదిలే మనస్తత్వం.

వెంటనే రంగనాయకమ్మ తన రెండో కూతురు సుభద్రకి ఫోన్ చేసింది. "ఏమే, భద్రా! నీ కూతురు పరిమళ ఎవర్నీ ప్రేమించలేదుకదా?" అని తిన్నగా ప్రశ్నించింది.

"అటువంటి వెధవ్వేషాలు వేస్తే నీ అల్లుడు ఇల్లు పీకి పందిరి వేసేస్తాడు. ఏం ఇంత రాత్రి ఫోన్ చేస్తున్నావ్?" అని ప్రశ్నించింది.

"ఏం లేదు! మన రంగా అనుకొన్నట్టుగా నెలరోజుల సెలవు మీద అమెరికానుంచి వచ్చాడు. ఇదివరకూ మనం ఏదో పిల్లల్ని ఏడిపించడంకోసం మొగుడూ పెళ్ళాలని అనేవాళ్లంకానీ, నిజం చేస్తే బావుంటుందని ఈ ముసలి ప్రాణానికి అనిపిస్తోంది. ఇదీ సంగతి అని చెప్పకుండా వాణ్ణి హైదరాబాద్ పంపిస్తాను. ఓ సారి వారిద్దరూ ఒకర్నొకరు చూసుకొంటే ఇష్టపడ్తారేమో? మీ ఆయన్ని కదిపి చూడు. ఏమంటాడో?"అంది.

"మేనరికాలు ఆయనకి ఇష్టం లేదమ్మా? ఈ మధ్యన మాకు తెలిసిన ఎవరో ఇద్దరు ముగ్గురు వాళ్ళ పిల్లలకి సంబంధాలేవైనా చెప్పమంటే, రంగాని గురించి చెప్పారు. వాణ్ని చూసి చాలకాలమైంది కాబట్టి రంగాని మట్టుకు పంపించు. ఆ సంబంధాల వాళ్ళవి మంచి కుటుంబాలు! నేనూ ఆయనా పరిచయం




చేస్తాం. ఏ పిల్లైనా నచ్చితే ముందుకు కదలొచ్చు!"

రంగనాయకమ్మ మనవడితో "నువ్వు వెంటనే బయలుదేరి హైదరాబాద్ వెళ్ళు. అత్తలిద్దర్నీ చూసిరా. తర్వాత విజయనగరం వెళ్ళి నీ మేనమామని కూడా చూసి రా. చిన్నవాడివి కాబట్టి నువ్వే వెళ్ళి వాళ్లందర్నీ చూసొస్తే గౌరవంగా ఉంటుంది. హైదరాబాద్ అత్తలు ఏవో సంబంధాలు చూపిస్తారు. చూడు. నీకు ఏ పిల్లైనా నచ్చితే తిరిగి వెళ్ళేలోపుగా ఓ ఇంటివాడవైపోవచ్చు!" అంది.

ఉయ్యాల మర్నాడు గోదావరి ఎక్స్ప్రెస్ కి తత్కాల్ లో హైదరాబాద్ టికెట్ కొన్నాడు. రంగనాయకమ్మ ఇద్దరికూతుళ్ళకీ సమాచారం అందచేసింది. రెండు గాజుసీసాల్లో గోంగూరపచ్చడి, రెండు సీసాల్లో కొరివికారం పంపిస్తున్నానని చెప్పింది.

"నాయనమ్మా! పిల్లల్ని చూడమంటున్నావ్, సరే! ఇచ్చిపుచ్చుకోవడాల మాటలు వస్తే అత్తయ్యలు ఏం చెప్తారేమోనన్న భయంగా ఉంది!" అన్నాడు ఉయ్యాల.

"ఒరేయ్! నీకు నా సంగతి పూర్తిగా తెలియదు. నీ ముత్తాతా, ముత్తవ్వా, నా ఆడపడుచూ కట్నకానుకల పేరిట నానా యాగీ పెట్టారు. మీ తాత బహు నెమ్మదస్తుడు. నా కష్టాలు చూసినవాడు కాబట్టి నా మాట విన్నాడు. మీ నాన్నకీ, బాబాయ్ లకీ కానీ కట్నం కూడా లేకుండా పెళ్ళిళ్లు జరిపించేశాను. కానీ మీ మేనత్తల వివాహానికి కట్నం యివ్వకతప్పలేదు. కట్నం పుచ్చుకోకపోవడం మనచేతుల్లో ఉంటుంది. యివ్వకపోవడమనేది ఆడపిల్లల వివాహాలకి ప్రతిబంధకం కావొచ్చు. అందుచేత కొంత రాజీ పడక తప్పదు. దారి తప్పిన సమాజం ఇంకా పూర్తిగా కోలుకోలేదు. అయితే కట్నాలని కేవలం ఓ సంప్రదాయంగా, ఆనవాయితీగా భావించే తీసుకొనే కుటుంబాలు, ఇంటికోడళ్లని అతి గౌరవంగా చూస్తాయి. కోడళ్ళ చేతికే పగ్గాలు అందజేస్తారు.

నీ మేనత్తలకిద్దరికీ కట్నాలిచ్చినా మంచి కుటుంబాల్లో పడ్డారు. కట్నకానుకల విషయం సంగతి అత్తయ్యలకి వదిలేయి. నా మనసు వారికి తెలుసు.

“అన్నట్టు మరో సంగతి! ఇదివరలో పురుషుడి అంగీకారమే ప్రధానంగా ఉండేది. ఆడపిల్ల తల్లిదండ్రుల అభిప్రాయమే శాసనమైయ్యేది. ఇప్పుడు కాలం మారింది. అమ్మాయిలు కూడా తమ అనంగీకారాన్ని తేటతెల్లంగా చెప్పేస్తున్నారు. అందుచేత అమెరికానుంచి వచ్చిన ఉయ్యాలవారబ్బాయిని చూసినవారందరూ మెచ్చేసుకొంటారని అనుకోకు. కాదంటే బాధపడకు! ఓ పని చెయ్యి. ముందు ఫోటోలు చూడు. నీకు నచ్చిన పిల్లని మొదట చూడు. అభిప్రాయాలూ తెలుసుకో. ఇద్దరికీ ఒకరికొకరు నచ్చితే ఇక రెండో పిల్లని చూడకు. కుటుంబాలు మంచివేనని చేబ్తున్నారు కాబట్టి ఆ సంబంధమే ఖాయపర్చమని అత్తయ్యలకి చెప్పు.

“ప్రేమించి వివాహాలు చేసుకొంటే తర్వాతి జీవితాలు వారి స్వయం కృతాలు. కుదిర్చిన సంబంధాలు బెడిసి కొడ్తే యిరువైపుల తల్లిదండ్రులూ, మధ్యవర్తులూ, కొంత నేరం నెత్తిమీదకు తీసుకోక తప్పదు. నీ వైవాహిక జీవితం అత్తయ్యల్ని ఇరుకులో పెట్టేదిగా ఉండకూడదు. వెళ్ళి పెళ్లికొడుకువై రా!” అంది రంగనాయకమ్మ.




ఉయ్యాల వాల్తేరు స్టేషన్ చేరాడు. ఆటో దిగుతోంటే ఫోన్. “స్టేషన్ చేరావా? రైళ్లు నిలిపే ప్లాట్ ఫారాలు ఇష్టం వచ్చినట్లు చివరి క్షణాల్లో మార్చేస్తారు. అందుచేత జాగ్రత్తగా చూస్తూ, వింటూ ఉండు.....

“బండి వస్తోన్నప్పుడు దూరంగా నిల్చో. బోగీ నెంబరు సరిగా చూసుకో’.....

“బండి వచ్చేసిందా? పెట్టిలోకి ఎక్కిన తర్వాత సామాను వదిలి కిందకి దిగకు. రోజులు బాగోలేవు. చేతికందినది చిక్కించుకొని పారిపోతున్నారు.....

“బండి కదిలిందా? ఇంకా లేదా? కదలగానే ఫోన్ చెయ్యి. తుని రాగానే ఇచ్చిన పులిహార తినేసి, మజ్జిగ తాగి పడుకో. అర్ధరాత్రి కాఫీ తాగాలని విజయవాడలో దిగకు. బండి కదిలి పోతుంది ........

“సికింద్రాబాద్ ఇరవై నిముషాలు ఆలస్యంగా చేరిందా! లైన్లో ఉండే ఆటోనే ఎక్కు. భద్రత్త ఇంటికి దారి గుర్తుందిగా. ఈ మధ్యనే వారి విజయా రెసిడెన్సీ పక్కనే మాయా మాల్ అనే ఓ పెద్ద మాల్ ని కట్టారు. మావయ్య స్టేషన్ కి వస్తానంటే, అంత ఉదయం అతన్ని కష్టపెట్టడం మంచిది కాదన్న ఉద్దేశ్యంతో నేనే వద్దన్నాను. ఇల్లు చేరగానే ఫోన్ చెయ్యి!” రంగనాయకమ్మ ఫోన్ల పురాణం ఇలా తడవలు తడవలుగా కొనసాగింది. అరగంట పోయిన తర్వాత ఉయ్యాల ఫోన్ మోగింది.

“ఉయ్యాలా! ఇల్లు చేరేవా?”

“దగ్గరకొచ్చేశాను. ఇప్పుడే చేరుకొంటున్నాను నాయనమ్మా!”

అన్నాడు ఉయ్యాల.

"నీకు కాఫీలు అవీ అందించిం-తర్వాత భద్రత్తని నాతో మాట్లాడమను. లేదా నేనే ఓ పావుగంటలో మాట్లాడతాను."

"అలాగే!" అన్నాడు ఉయ్యాల నీరసంగా.

పావుగంట తర్వాత రంగనాయకమ్మ కూతురికి ఫోన్ చేసింది. "ఏమే భద్రా! రంగాకి కాఫీ అవీ యిచ్చావా?"

"రంగా ఇంకా రాందే!"

"అదేమిటే? ఇంటికి దగ్గర్లోనే ఉన్నాడని ఇందాక ఫోన్ చేస్తే చెప్పాడు! ఆటోవాడు దారి తప్పించేశాడేమో? లేక మీ యిల్లు ఆనవాలు పట్టలేకపోయాడేమో?"

"సరేలే! నీ అల్లుణ్ణి బయటకి వెళ్ళి చూడమంటాను. నేను మళ్ళీఫోన్ చేస్తాన్లే!"

***

ఒకవైపు వాహనాలు వెళ్ళే రోడ్డు మధ్యలో డ్రైనేజి రిపేరుకొసం అడ్డంగా వెడల్పాటి గొయ్యి తవ్వేశారు.

"సార్! రోడ్డు తవ్వేసినట్టున్నారు. మీరు చెప్పిన మాయామాల్ అదుగో, దగ్గర్లోనే రోడ్డు కవతలి పక్క కనిపిస్తోంది చూడండి. ఈ గొయ్యి తవ్వి ఉండకపోతే, కాస్త ముందుగా ఉన్న యూ టర్న తీసుకొని మాల్ వద్దకు తీసుకుపోయుండేవాణ్ణి. ఇప్పుడు అక్కడికి బండి తీసుకుపోవాలంటే వెనక్కి తిరిగి మళ్ళీ మూడు కిలో మీటర్లు చుట్టుప్రయాణం



చెయ్యాలి. ఇక్కడ దిగి పోయి, డివైడర్ మీదుగా రోడ్డుకి అవతలిపక్కకి వెళ్ళి నడిస్తే మాయమాల్ కి మూడు నిముషాలు. లేదంటే వెనక్కి తిరిగి, చుట్టూ తిప్పి తీసుకువెడ్తాను! మీ ఇష్టం," అన్నాడు ఆటోవాలా.

ఉయ్యాల ఆటో చార్జి చెల్లించి, వీపుకి తగిలించుకొన్న బ్యాక్ ప్యాక్ తో దిగి డివైడర్ దాటాడు. సరిగా అప్పుడే నాయనమ్మ ఫోన్ వచ్చింది. ఫోన్ చెవిదగ్గర పెట్టుకొని రోడ్ క్రాస్ చేస్తూ, మాయమాల్ వైపునుంచి వేగంగా వస్తున్న మోటార్ సైకిలుని గమనించలేదు. దానిమీద మీద పదోతరగతి పెద్దపరీక్షల కోసమని కొడుకునీ, కూతుర్ని ఇంటికి బహు దూరంగా ఉన్న పరీక్షాకేంద్రానికి తీసుకువెడ్తున్న ఓ తండ్రి - భుజానికీ, వంచిన మెడకీ మధ్య సెల్ ఫోన్ ఇరికించి, 'పిల్లల్ని దింపేసిన తర్వాత, తిరుగుదారిలో కూరగాయల మార్కెట్లో తీసుకురావాల్సిన కూరగాయలేమిటో మీకు చెప్పాను గదా? మర్చిపోకుండా తీసుకు రండి. అన్నట్టు పచ్చిమిరపకాయలు చెప్పడం మరిచాను. మరి.....' అంటూ చెప్తూన్న భార్య మాటలు వింటున్నాడు. వెనక కూర్చున్న కూతురూ, కొడుకూ వాళ్ల వాళ్ల సెల్ ఫోనుల్లో ఆ రోజు పేపర్లలో ఫలానా ప్రశ్నలు రావొచ్చన్నసంభావ్యతని గురించి స్నేహితులతో మాట్లాడుతున్నారు. వాళ్ళు ముగ్గురూ కూడా రోడ్డు క్రాస్ చేస్తున్న ఉయ్యాలని గమనించలేదు. జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది. ఫలితంగా నలుగురి ప్రాణాలూ గాల్లోకి ఎగిరిపోయాయి. ఉయ్యాల గిలగిలా కొట్టుకొంటూ, అతికష్టం మీద నాయనమ్మకి చెప్పిన ఆఖరి సమాధానం "అలాగే!" ఉయ్యాలా, అతనితోబాటు మరో ముగ్గురూ చేరాల్సిన ఆఖరి గమ్యమే చేరుకొన్నారు!

తప్పెవరిదీ అంటే అందరిదీను. కారణం ఎవరూ, ఏమిటీ అంటే కార్యకారణసంబంధమే! కాదా, ఆ నలుగురి జీవితాలకీ పైవాడు రచియించిన గమ్యప్రయాణం. 21వ శతాబ్దారంభంనుంచి విజృంభించిన సాంకేతిక పరిజ్ఞానానికి ప్రామాణికంగా నిలిచేవి జనబాహుళ్యం హస్తభూషణాలుగా కనబడే సెల్ ఫోనులు, స్మార్ట్ ఫోనులు. వాటి ఉపయోగాలు అనేకమైనా, అవి వ్యసనంగా మారి సమాజానికి బహుముఖాలా కీడుని కూడా చేస్తున్నాయి. జీవితానికి మరణమే గమ్యమైనప్పుడు మార్గాలనేకం.

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**( ఆధారం : చ = అసలు అక్షరం 'క' )**

**ఆమచే గొమచుపా - అప్పటోప్పట క్షుఛరు,**
**క్షామంషు గెజిక్షి చా - హలరు కేచొకుత.**

**టజను జోనజికింట - గాతిపన్నుశు దగా!**
**ఉజమి గైడంషు న్మ - ట్లజ్ఞరౌత,**
**చజబంను గుమ్రగరు - దశకిపన్నుశు దగా!**
**టజచొప్ప రోజ్ఞంషు - టపచు హే నశుత.**

**(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)**

**గతనెల జవాబు :**

సముబుద్దే యిందరికి - సర్వవేదసారము
సము డిందరికి హరి - సాధనమో యయ్యా!
1. చీమకు దన జన్మము - చేరి సుఖమై తోచు
దోమకు దన జన్మము - దొడ్డ సుఖము
ఆమని యీగకు సుఖ - మా జన్మమై తోచు
ఏమిటా నెక్కువ సుఖ - మెవ్వరి కేదయ్యా!

ఫిబ్రవరి నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ ఎన్. ప్రసాద్, విజయవాడ

# కొత్త రామానందం



## నవ వసంతానికి నాంది ఫాల్గుణ మాసం

శ్రీ మహాలక్ష్మి క్షీర సాగరం నుంచి ఉద్భవించిన, హరిహర సుతుడు అయ్యప్పస్వామి జన్మించిన,శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం ఫాల్గుణ మాసం.

విష్ణువుకు ప్రీతికరమైన ఈ మాసములో మొదటి పన్నెండు రోజులూ శ్రీమహావిష్ణువును శక్తి మేరకు పూజించి, పాలను నైవేద్యంగా సమర్పించాలి.

ఫాల్గుణ శుద్ధ తదియనాడు మహాలక్ష్మీ సమేత మహావిష్ణువును గానీ, పార్వతీ సమేత పరమశివుని గానీ పూజిస్తూ 'సౌభాగ్య వ్రతాని ఆచరిస్తారు. ఉప్పు, కారం నూనె ఉపయోగించకుండా చేసిన భోజనాన్ని తూర్పు ముఖంగా నేలపైన కూర్చొని భుజించాలి. రాత్రి ఉపవాసం ఉండి పవిత్రంగా గడపాలి. ఈ వ్రతాన్ని స్త్రీ పురుషులందరూ పాటించవచ్చు. అందువల్ల సౌభాగ్యం కలుగుతుంది.

ఫాల్గుణ పూర్ణిమ నాడు సోదరి చేతి నుంచి మామిడి పువ్వును స్వీకరించి, దానిని చందనంతో కలుపుకుని,

**'చూత మగ్ర్యం వసంతస్య,**
**ముకుంద కుసమంతావ**
**స చందనం పీబామధ్య**
**సర్వ కామద సిద్ధయే'**

అనే శ్లోకాన్ని పఠిస్తూ పూజించాలి

ఈ మాసంలో మొదటి పన్నెండు రోజులలో ఏదో ఒక రోజు వివిధ ధాన్యాలతో పాటు వస్త్రదానం చేయడం వల్ల శ్రీ మహా విష్ణువు కటాక్షం లభిస్తుంది. శక్తి ఉన్నవారు ఈ మాసంలో ఆలయానికి గానీ, బ్రాహ్మణునికి గానీ ఆవును దానం ఇవ్వడం మంచిది.

ఫాల్గుణ శుద్ధ చవితినాడు నువ్వులను దానమివ్వాలి. ఫాల్గుణ పూర్ణిమ నాడు లింగపురాణాన్ని దానమివ్వడం వల్ల ఇహంలో సౌఖ్యం, పరంలో శివలోక ప్రాప్తి కలుగుతుందని శాస్త్ర వచనం. ఫాల్గుణ శుద్ధ పూర్ణిమను మహా ఫల్గుణి అని పిలుస్తారు. పూర్వం మదురైలో శ్రీ మీనాక్షి అమ్మవారు తపస్సు చేసి ఫాల్గుణ పూర్ణమి నాడు శ్రీ సుందరేశ్వర స్వామిని వివాహం చేసుకున్నట్టు కథనం. కనుక ఈరోజున మీనాక్షి అమ్మవారిని, పరమ శివుని పూజించడం ముఖ్యం. ఇదే కాక ఈ పూర్ణిమను హోళికా పూర్ణిమ, కాముని పూర్ణిమ అని కూడా అంటారు. మూడవ కన్ను తెరచి శివుడు మన్మధుని భస్మం చేసినట్లు కథనం. రంగులు చల్లుకోవడం ఆచారం, కాగా పరమశివుని ఈరోజు పూజించడంతో పాటు శ్రీకృష్ణుని పూజించి డోలోత్సవాన్ని నిర్వహించాలి. ఫాల్గుణ శుద్ధ అష్టమి నాడు శ్రీ రాములవారి దేవేరి అయిన సీతా అమ్మవారి జన్మదినం. సీతమ్మవారిని భక్తి తో పూజించి రామాయణం పఠించాలి. ఫాల్గుణ అమావాస్యను కొత్త అమావాస్య అని పిలుస్తారు. ఈరోజున విధిగా పితృ దేవతలకు తర్పణాలు వదిలి, పిండ ప్రదానాలు చేయాలి.

### వసంతాల కేళి - హోళి

దేశమంతటా వేరువేరు రూపాలలో, వేరువేరు కారణాల తోరకరకాల ఉత్సవాలు జరిపే ఒక రోజూ ఉంది. త్రిమూర్తులైన



లైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను వారి సతుల సమేతంగా పూజించే రోజు కూడా సంవత్సరంలో ఈరోజు ఒక్కటే. అదే ఫాల్గుణ పూర్ణిమ. ఫాల్గుణోత్సవం, కళ్యాణ పూర్ణిమ, డోలా పున్నమి, హుతాశని పూర్ణిమ, కాముని పున్నమి, అనంగ పూర్ణిమ, హోళీకా దహో, హోళికా పూర్ణిమ, వసంతపూర్ణిమ, హోలీ - ఇలా రకరకాల పేర్లతో పిలిచే రోజు ఒక్కటే. భిన్నమైన పేర్లు ఉన్నట్లే, ఈ రోజు జరిపే కార్యక్రమాలు, అనుసరించే ఆచారాలు, జరిపే పూజలు సైతం భిన్నమైనవే.

శివపార్వతులను కలిపే ప్రయత్నంలో మదనుడు శివుడి ఆగ్రహానికి గురై దహనమయ్యాడు. అతడి భార్య అయినా రతీదేవి అభ్యర్థన మేరకు ఆమెకు మాత్రమే సశరీరుడిగా, మిగిలిన వారికి అనంగుడిగా తిరిగి లేచిన రోజు ఫాల్గుణపౌర్ణమి కాబట్టి ఈ రోజుకు కాముని పున్నమి, అనంగ పున్నమి అని పేర్లువచ్చాయి అని పురాణాలు వివరిస్తున్నాయి. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మానవజాతి నిండు పున్నమి నాడు పండుగ వెన్నెలరోజు ఆనందాతిరేకంతో చిందులు తొక్కడం, రంగులు చిలకడం, చిరునవ్వే జవాబుగా ఆడామగా తేడా మరచి పరవశించడం... అలనాటి బృందావన రాసలీల విలాసాన్ని మరపిస్తూ, బ్రజభూమి, నందగావ్, ఇలా కృష్ణుడు విహరించిన ప్రదేశాలన్నీ హోలీ పండుగను ఘనంగా జరుపుకుంటాయి.

శిశుహంతకి హోలిక వినాశనానికి సూచికగా హోలీ పర్వదినం ఏర్పడిందనీ చెబుతారు. హోలీక నేపథ్యంగా మరో కథనం ఉంది. అగ్ని కూడా కాల్చలేని మహా శక్తిమంతురాలైన హోలిక హిరణ్యకశిపుడి సోదరి. హరినామ సంకీర్తన వీడని తన పుత్రుణ్ణి ఒళ్ళో కూర్చోపెట్టుకుని అగ్ని ప్రవేశం చేయమని హిరణ్యకశిపుడు ఆమెను ఆదేశిస్తాడు. హరి భక్తుడి స్పర్శ వల్ల హోలిక శక్తి సన్నగిల్లి అగ్నికి



ఆహుతి అవుతుంది. ప్రహ్లాదుడు క్షేమంగా బయటపడతాడు.

లోకకంటకురాలైన అయిన 'దుంథ' అనే రాక్షసి అంతానికి సంతోషంగా ప్రజలు హోలీ జరుపుకునే సంప్రదాయం స్థిరపడిందని భవిష్య పురాణం విశదపరచింది.

శిశు హంతకి అయిన 'హోలిక' అనే రాక్షసి వధను హోలీగా జరుపుకుంటున్నట్టుగా పురాణాలు ప్రస్తావిస్తున్నాయి. హోలిక రోజుకొక శిశువును తింటూ గర్భ శోకం కలిగిస్తూండేది. ఒకరోజు ఓ వృద్ధురాలి వంతు వచ్చింది. ఆమె తన ఏకైక మనవణ్ణి రాక్షసి పొట్ట పెట్టలేక ఒక యోగిని శరణు వేడుతుంది. అసభ్య వాక్కుల్ని వింటే రాక్షసి మరణిస్తుంది అని యోగి రహస్యం వెల్లడిస్తాడు. ఆమె ఊళ్లోని జనాల్ని పోగేసి రాక్షసిని నానా మాటలతో, పరుష పదజాలంతో తిట్టించింది.

దాంతో హోలిక తల పగిలి చచ్చింది. ఆ రాక్షసి మృతదేహాన్ని దహనం చేసి, దాని వినాశనానికి సూచికగా హోలీ జరుపుకున్నారు. రంగులు చిలకరించుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

హోలీ పండుగ హోళికా దహనంతో మొదలవుతుంది. ఆ మంటలను ఉత్తరాదిన ప్రతి గ్రామంలోను ప్రతి వీధి చివర వేస్తారు. ఆ మంటల్లో వెళ్లిపోతున్న చలికాలంలో పేరుకున్న చెత్తా చెదారం వేస్తారు. అలా వాతావరణాన్ని మెరుగుపరుచుకోవడం జరుగుతుంది. అదేవిధంగా మనుషులు తమ మనసులోని మలినాన్ని కడిగిపారేయడం, అందరి మధ్య కొత్త స్నేహబంధాలు ఏర్పడాలని కోరుకోవడం జరుగుతుంది. హోలీ జీవితాలకు కాముని పున్నమ వెన్నెల.వసంతాల చిరుజల్లు ఆనంద పారవశ్యాల ఆమని డోలిక, ఆ మర్నాడు(శ్రావణ బహుళ పాడ్యమి) కొన్ని రాష్ట్రాలకు సంవత్సరాది కొత్త సంవత్సరానికి స్వాగతసూచకంగానూ, సంతోషాలను వ్యక్తం చేసేందుకు గానూ ఒకరిపైఒకరు ఒక రు రంగు పొడులు, రంగు కలిపిన నీళ్లు చల్లుకుం-

టారు. చల్లుకుంటూ, హోలీ కే హోలీ కె రంగ హోలీ చమకతె హోలీ అంటూ పాడతారు. ఆ పాట భావం క్లుప్తంగా మోదుగపూలు తెచ్చి, రోట్లో దంచి, కుండలో వేసి, రసం తీసి, వెదురు గొట్టంలో నింపాలి. దీనికి వసంతం అని పేరు. ఇది ఎర్రగా ఉంటుంది. దీన్ని వావి వరుసలు పాటించకుండా అందరూ ఒకరిపై ఒకరు చల్లుకోవాలంటారు.

ఈ మాస వాతావరణంలో ఇది ఒంటి మీద పడటం వల్ల శరీరానికి కాంతి, వర్చస్సు ఎక్కువ అవుతుంది. శరీరంలో ఉద్రేకాలు (రక్తపోటు మొదలయినవి), మానసిక దుర్వికారాలలాంటివి తగ్గుతాయని ఆయుర్వేదం చెబుతుంది. మామిడి పూత,శ్రీ చందనాన్ని కలిపి హోలీ నాడు తీసుకోవడం వల్ల రాబోయే వేసవిని తట్టుకోగల శక్తిని పొందవచ్చని ఆయుర్వేదం వివరిస్తోంది. పసుపు కలిపిన చందనం, అష్ట గంధం, సత్యోషధ జలం, ప్రాకృతిక వృక్షమూల రసం, మోదుగ పుష్పాల గుజ్జు కలిపిన జలాన్ని హోలీ రంగులుగా వినియోగించాలని ధర్మ శాస్త్రం చెబుతోంది.

బ్రజ్ భూమిలో హోలీ అంటే ప్రేమ బాసలూ, చిలిపి తగవులూ అయితే మథుర, బృందావనం, గురుగావ్, బర్సానాల్లో ఈ వేడుక తీరు వేరు. సుమారు 16 రోజుల పాటు హోలీ జరుగుతుంది. నందగావ్ ను శ్రీకృష్ణుడి జన్మస్థలంగాను, బర్సానాను రాధ పుట్టిన ఊరు గానూ భావించి అక్కడ పండుగ చేసుకుంటారు. నంద గావ్ కృష్ణులు బర్సానాలోని రాధా రాణి ఆలయం దగ్గర జెండా పాతి మాదే విజయం అన్నట్టుగా గోల గోల చేస్తుంటే, లావుపాటి కర్రలతో వాళ్ళను వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తారు బర్సానా రాధలు. చివరి రోజున ఇరుపక్షాలూ రంగులు చల్లుకోవడంతో ఈ వేడుక ముగుస్తుంది.

మన దేశంలో ఉత్తరాదివారు, ఇంకా నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక ఇంకా హిందువులు ఎక్కువగా ఉన్న సురినామ్, గయానా, దక్షిణ ఆఫ్రికా, ట్రినిడాడ్, ఇంగ్లాండ్, అమెరికా, మారిషస్, ఫిజీ దేశాల్లోనూ ఏటా హోలీ వేడుకలు ఘనంగా జరుపుకుంటారు. బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ లలో ఈ పండుగను వసంత పంచమి పేరుతో జరుపుకుంటారు. గుజరాత్ లో అయితే మంటలతో పాటు పురుషులు ఉట్టి కొడుతుంటే, స్త్రీలు వాళ్ళమీద రంగు నీళ్లు చల్లడం ద్వారా హోలీ జరుపుకుంటారు.

హోలీ చివరి రోజు పౌర్ణమి నాడు వస్తుంది. చీకటి రాగానే వీధి వీధిన మంటలు వేస్తారు. ఆ మంటల గుండా సాధువులు నడవడం ఆనాటి ప్రత్యేక ఆకర్షణ. అప్పటివరకూ హిమాలయ ప్రాంతాల్లో తపస్సు చేసుకుంటున్న సాధువులు ఆ రోజున నంద గావ్ వస్తారు. సమీపంలోని కొలనులో స్నానం చేసి ఆ సాధువులు కళ్ళు మూసుకుని బయలుదేరతారు,

హోలీనాడు ఉదయాన్నే 'హోలీ ఆయిరే' అనే కేకలతో గ్రామాలు పట్టణాలు మేల్కొంటాయి. ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకుంటూ తీపి పదార్థాలు పంచుకుంటారు. తమ దుస్తులను, శరీరాన్ని రంగుల మయం చేసినా ఎవరూ ఏమాత్రం కోపం తెచ్చుకోరు. ఇది వారి సయోధ్యత ను పెంచే స్నేహానికి గుర్తుగా నిలిచే హోలీ పండుగ.

కొత్తగా పెళ్లి అయినవారికి, వరస అయ్యేవారికి, ప్రేయసీప్రియులకు హోలీ పండుగ మరీ ఒక ఆట విడుపు. ఈ పండుగ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తుంటారు. ఇంతకాలం నుంచి శ్రద్ధగా, పట్టుదలగా చదివిన విద్యార్థులకు హోలీ పండుగ పెద్ద రిలీఫ్ ను ఇస్తుంది. పరీక్షలదాకా పడిన శ్రమను ఈ పండుగతో తీర్చేసుకుని పెద్ద రిలీఫ్ గా ఫీల్ అవుతారు. కృత్రిమ రంగులవల్ల చర్మ కేన్సర్, ఎలర్జీలు, కళ్ళు దెబ్బతినడం నష్టాలెన్నో. ఇటీవల ఆరోగ్య స్పృహ పెరగడం, రంగులలోని విషపదార్థాలగురించి విస్తృతంగా ప్రచారం చేయడంతో సేంద్రియ రంగులతోనే ... చెమ్మకేళి అంటున్నారంతా.

హోలీ పండుగ ది. 20 - 3 - 2019 న

# భువనచంద్ర



## జై హింద్

"యుద్ధం మొదలైంది" విచారంగా అన్నాడు సదాశివరావు.

"అవును..." గాఢంగా నిట్టూర్చి అన్నాడు నిషధీశ్వర్రావు.

"రేపటి బతుకుని ఊహించలేము... అణ్వాస్త్రాలు ఉపయోగిస్తే భూమి ముక్కలైపోతుంది. మనుషులతో సహా జీవుల్లో మూడుమ్ముప్పాతిక భాగం శవాల గుట్టలుగా మారతారు. ప్రకృతి ధ్వంసమవుతుంది. తినడానికి తిండీ తాగేందుకు నీరూ వుండదు. అణ్వాస్త్రాల వల్ల ఉద్భవించిన రేడియేషన్ చేసే నష్టం అంతా ఇంతా కాదు. మనుషులు మట్టిముద్దల్లా మారతారు. చికిత్స చెయ్యడానికి వైద్యులూ ఆస్పత్రులూ మిగిల్తేగా! కొన్ని దశాబ్దాలపాటు అంతరిక్షమంతా అణు ధూళి అలముకునే వుంటుంది. జలచరాలు కూడా మిగలవు. ఇహ పక్షుల మాటే ఉండదు! రెండో ప్రపంచ యుద్ధం లో వాడిన అణుబాంబుల కంటే ఇవ్వాళ ఉన్నవి అత్యంత శక్తివంతమైనవి. దేవుడా... మానవుడుకి అసలు బుద్ధి అనేది ఇస్తే తప్పు లేదు. కానీ బుద్ధితోబాటు విధ్వంసం సృష్టించగల శక్తిని ఎందుకిచ్చావూ?" వేదనగా అన్నాడు లక్ష్మణయ్య.

"యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ప్రస్తుతానికి ఆ భగవంతుడికొక్కడికే ఉంది" నిట్టూర్చాడు రమణయ్య. రమణయ్య లక్ష్మణయ్య అన్నదమ్ములు.

"యుద్ధం భగవంతుడు మొదలుపెట్టింది కాదు రామనయ్యా! అది మనుషులు మొదలెట్టింది. సాగే యుద్ధం సైనికుల మధ్య కాదు... అహంకారాల మధ్య. బాలి అయ్యేది సైనికులూ సామాన్యులూ!" బాధ ధ్వనిస్తుండగా అన్నారు గడుసు మాస్టారు.

" అదేమిటీ? దాడులు మొదలెత్తిన్దీఈఇ పరాయి దేశమేగా?" ఆశ్చర్యంగా అన్నాడు సదాశివరావు.

"చర్యకి ప్రతిచర్య బింబానికి ప్రతిబింబమూ తప్పవు గదా! అహంకారమే అసలు కారణం" జవాబిచ్చారు గ.మా.

"ఈ ఉగ్రవాదులు పుట్టుకొచ్చింది మత మౌఢ్యంలోనించే! స్కూళ్ళ నుంచీ వాళ్లకి ఒకటే పని. పరమత ద్వేషం రగిలించడం. ఆత్మాహుతుల వల్ల అర్జంటుగా స్వర్గం లభిస్తుందని చిన్నతనం నించే నమ్మించడం హూ.. అసలు యీ స్వర్గాలూ నరకాలూ సృష్టించినదే మానవుడు" కోపంగా అన్నాడు లక్ష్మణయ్య.

"నిజం చెబితే దేవుడ్ని సృష్టించినవాడు కూడా మనిషే! మనుషుల్లో పాప భీతిని పెంచి మృగాలుగా మారకుండా వుండాలని ఓ తెలివైనవాడు దేవుడ్నీ స్వర్గ నరకాల్నీ సృష్టిస్తే కొందరు మతాన్ని సృష్టించి సాటి మానవుల్ని బానిసలుగా మారుస్తున్నారు. అరే బాబా, చావుకీ, రోగానికీ, వార్ధక్యానికీ, ప్రమాదానికీ లేని మతం, మనిషికి ఏమి వెలగబెడుతుందనీ?" ఆగారు గ.మా.

"అంటే, దేవుడే లేడంటారా?" ఆశ్చర్యంగా అన్నాడు రమణయ్య.

"ఎందుకు లేడూ? నీలో నాలో సర్వజీవుల్లోనూ శ్వాస రూపంలో సంచరించేది దేవుడిగా! లేక, మనం దేవుడని పేరు పెట్టుకున్న ఓ మహా చైతన్య శక్తేగా. మనిషి చేసిందల్లా ఆ మహాశక్తికి ఓ రూపం కల్పించడం మాత్రమే. తరవాత్తరవాత ఎవరికీ తోచిన రూపాలు వాళ్ళు కల్పించారు. ఆ తరవాత లోకోద్ధరణ కోసం అవతరించిన మహానుభావుల్నే మతాలకి ఆటపట్టుగా వాడుకున్నారు. మొదట్లో మత నిర్మాణ-



చైతన్యం సంకల్పబలం

మూ మంచే చేసింది. మనుషుల ప్రవర్తనను సరిదిద్ది మానవత్వం కలిగిన మానవులుగా మార్చింది. ఆ తరవాత కొందరు పెద్దలు మతాన్ని తమ స్వార్ధం కోసం మారణాయుధంగా మార్చారు" సుదీర్ఘంగా నిట్టూర్చారు గ.మా.

"ఈ పద్ధతిని మార్చలేమా?" విచారంతో అన్నాడు నిషధీశ్వర్రావు.

"మనుషుల్లో ఓ ఆలోచన కలగాలి! మతం పేరుతో మన మరణ శాసనాన్ని మనమే రాసుకుంటున్నామనే ఆలోచన కలగాలి. తద్వారా 'నిజం' ముఖ్యమా, ఇజం'ముఖ్యమా' అనే విచక్షణ జనంలో రావాలి. యుద్ధాలనేవి అహంకారం వల్ల వస్తున్నవే గానీ వాటంతటఅవి రావనే విషయాన్ని గ్రహించగలగాలి. అప్పుడు మాత్రమే మనుషుల మధ్య, దేశాల మధ్య వుండే సమస్యలు చర్చల ద్వారా పరిష్కరింపబడతాయి. మనిషి పెంచుకోవాల్సింది బుద్ధినీ ఆలోచననీ గానీ అధికారాన్నీ అణ్వస్త్రాలనీ కాదు" వివరించారు గడుసు మాస్టారు.

మెల్లగా తలవూపాడు నిషధీశ్వర్రావు.

"ఓ చిత్రం తెలుసా? అక్కడ యుద్ధం జరుగుతోంది. దానికి కారణం ఒక దేశంలో వున్నా, ఆ దేశం పెంచి పోషిస్తున్న ఉగ్రవాదం. చిత్రం ఏమంటే, ఆ యుద్ధంలో చనిపోతున్నది ఎవరూ? సైనికులు" ఆగారు మాస్టారు.

"అవును. మనకోసం వాళ్ళు ప్రాణత్యాగం చేస్తున్నారు" తలఊపాడు సదాశివరావు.

"కదూ..! కానీ ఆ సైనికులు ఎవరూ? మనలోంచి వేల్లినవారేగా! ఆ సైనికుల్లో హిందువులు మాత్రమే కాదు, సిక్కులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, జైనులు అందరూ వున్నారు. అన్ని రాష్ట్రాల వారూ ప్రాంతాలవారూ వున్నారు. వారందరి ధ్యేయం ఒక్కటే, భరతమాతని రక్షించడం, భారతదేశం కోసం ప్రాణాల్ని బలివ్వడం. ఎండల్లో, వానల్లో, గడ్డకట్టించే భయంకరమైన చలిలో, కొండల్లో కోనల్లో ఎడారుల్లో సముద్రంలో నిరంతరం పహారా కాస్తూ, ప్రాణాలు అరచేత బెట్టుకుని మనని రక్షిస్తున్నారు. లారి మనమేం చేస్తున్నాం? పదవులకోసం, పైసలకోసం, పార్టీలకోసం, పరువు ప్రతిష్టలకోసం కాట్లకుక్కల్లా కొట్టుకు చస్తున్నాం. కులం పేరుమీదా, మతం పేరుమీదా నడిరోడ్ల మీద ఒకరినొకరం నరుక్కుంటున్నాం. విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ సంఘానికి తలనెప్పిగా మారుతున్నాం. ఇదెంతవరకూ సమంజసం?" ఎక్కడో చూస్తూ అన్నారు మాస్టారు.

" 'నాది నాది అనుకున్నది నీదికాడురా'అనే ఓ లైన్ వుంది ఓ సినిమా పాటలో. ఏది నీదీ? అమ్మ కడుపులో వున్నప్పుడు నీ మతం ఏమిటో, నీ కులం ఏమిటో, నీ తల్లిదండ్రులు ఎవరో, వాళ్ళ పేర్లేమిటో, అసలు నువ్వు మగో ఆడో దేవుడనేవాడు ఉన్నాడో లేదో అలాగే దెయ్యాలూ భూతాలూ ఉన్నాయో లేదో నీకు తెలుసా? నీకేకాదు. ఎవ్వరికైనా తెలుస్తుందా? నో! తెలవదు. నీ తల్లిదండ్రుల పదవులూ, పరువు ప్రతిష్టలూ, ఆస్తిపాస్తులూ, బంధు మిత్ర గణాలూ ఇవి కూడా ఏమీ తెలీదు. అన్నీ తెలిసేది కన్నతల్లి ఒడిలోంచి ఈ నెల తల్లి ఒడిలోకి వచ్చాకే. సరే యాభై ఏళ్లో ఎనభై ఏళ్లో ఇందు నూరేళ్ళు యీ నేలతల్లి ఒడిలో ఆడీ పాడీ, నవ్వీ ఏడ్చీ, కొంత సంపాయించీ, కొంత పోగొట్టుకునీ బ్రతుకుని గడిపెస్తావు. ఆ లోపలికి పోయాక మళ్ళీ ఏది నీదీ? ఇక్కడ సంపాయించింది ఇక్కడే వదిలి ఒంటరిగా, ఖాళీ చేతులతో వెళ్ళిపోతావు. నువ్వూ నేనే కాదు, అమెరికా వాడైనా, రష్యావాడైనా, పాకిస్తాన్ వాడైనా, పరమ శక్తిమంతుడైనా నేలతల్లి ఒడిలోకి చెరక తప్పదు.

ఈ కాస్త జీవితం కోసం ఎందుకీ పంతాలూ? ఎందుకీ పట్టుదలలూ, అహంకారాలూ, కార్పణ్యాలూ, కుచ్చితాలూ? భాయీ.. ఒక్క విషయం చెబుతా.

దేశ సరిహద్దుల్లో సైనికుడు తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించాలంటే, దేశం లోపల వుండే ప్రతి పౌరుడూ కలుపు మొక్కలు విస్తరించకుండా ఎప్పటికప్పుడు వెయ్యికళ్ళతో గమనిస్తూ వుండాలి.

ఒక యుద్ధం అప్పటికప్పుడు మొదలవదు. ఎన్నో కుతంత్రాలూ, కవ్వింపులూ, మరెన్నో గూఢచార, ఉగ్రవాద చర్యలే యుద్ధానికి కారణమవుతాయి.

నీ వీధిలోకి, నీ ఊళ్ళోకి వచ్చిపోయే ప్రతివాడ్నీ గమనించు. చుట్టూ జరుగుతున్న సంఘటనలను గమనించు. దేశద్రోహానికి పాల్పడే వాళ్ళని గుర్తించి ఆ సమాచారం ప్రభుత్వానికి అందించు. అలా చెయ్యడం వల్ల అనేక దుర్ఘటనలను మనం ఆపగలం. కులమతాలకి అతీతంగా ప్రాణాలొడ్డి పనిచేసే సైనికుడికి మనం నిజమైన తోడుగా నిలవగలం. దేశద్రోహం అంటే దైవద్రోహం లాంటిది. అందుకే అప్రమత్తంగా ప్రతి పౌరుడూ వుండితీరాలి. ఎప్పుడు రాలిపోతుందో తెలీని ఈ చిన్న జీవితాన్ని సఫలీకృతం చేసుకోవాలంటే మొదట మనం అలవారచుకోవలసింది సాటి మనుషుల మీద ప్రేమ. అందుకే పెద్దలంటారు 'Make - No War' అని!" ముగించారు మాస్టారు.

"నిజం మాస్టారూ దేముడూ, రైతూ, ప్రకృతీ, సైనికుడూ, పంచాభూతాలూ కూడా కులమతాలకి అతీతులే. అందుకే పంచభూతాలతో పాటు అన్నం పెట్టే రైతునీ, మనకోసం ప్రాణాలర్పించే సైనికుడ్నీ మనం ప్రేమిద్దాం!" భక్తిగా అన్నాడు నిషధీశ్వర్రావు.

వీరుడిగా తిరిగి వచ్చిన వింగ్ కమాండర్ వర్ధమాన్ అభినందన్ కూ, అసువులు బాసిన సైనికులకూ, సగౌరవంగా సెల్యూట్ చేస్తూ

మీ భువనచంద్ర

## పసిడి మనసులు ( 32 వ పేజీ తరువాయి)

"ఇహ అమ్మాయిల వంతు, అమ్మా లావణ్యా! నీ భవిష్యత్తు ఆలోచన ఏంటో చెప్పు, మీ తల్లిదండ్రులు నిన్ను ఏం చదివించాలను కుంటున్నా రు?"

" పంతులుగారూ! నాకు హైస్కూల్ వరకూ చదువు చెప్పించి, పెళ్ళిచేస్తారుట! అమ్మాయిలకు ఎక్కువ చదువకూడదుట!" అనిచెప్పింది. అంతా ఫక్కున నవ్వారు.

ఇలాకొంత మంది అమ్మాయిలు చెప్పాక "ఇప్పుడు సుగుణ చెప్తుంది" అని పంతులుగారు అనగానే సుగుణ లేచి నిఠారుగా నిల్చుని చెప్పసాగింది.

"మా అమ్మానాన్నా నన్ను ఒకమంచి టీచర్ను చేయాలను కుంటున్నారు పంతులుగారూ! ఇప్పుడు పిల్లలకెవరికీ మానవతా విలువలైన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ,అహింసలు తెలీవుట, పెద్దయ్యాక అంతా అసత్యాలు చెప్తున్నారుట! అన్యాయాలు చేస్తున్నారుట! లంచాలు తీసుకుని, మోసాలు చేస్తూ డబ్బుసంపాదించేస్తున్నారుట, తోటివారిమీద ప్రేమ, స్నేహం, సాయం చేయటం లేనేలేదుట, స్వార్థంతోనే 'చిన్ని నా బొజ్జకూ శ్రీరామ రక్ష' అని స్వంత లాభమే చూసుకుంటున్నారుట. మీరు నేర్పిన దేశభక్తి గేయం లోని 'స్వంత లాభము కొంత మానుకు పొరుగువారికి తోడుపడవోయ్! అనే మాటే మరచిపోతున్నారుట! చిన్నతనం లోనే ప్రాథమిక పాఠశాల లోనే మంచి అలవాట్లు నేర్పితే మొక్క నేరుగా పెరిగినట్లు సమాజం మొత్తం బాగుపడుతుందిట! ఇప్పుడు జరిగే అన్యాయాలన్నీ ఆగిపోతాయిట! అందుకే మా అమ్మా నాన్నా నన్ను ఒకమంచి టీచర్ను చేసి పిల్లలందరికీ మంచి నేర్పించేలా చేస్తారుట!" అంది సుగుణ ఉపన్యాసం చెప్పినట్లు.

పంతులుగారు చప్పట్లుకొట్టి " చూశారా! పిల్లలూ ! సుగుణ అమ్మా నాన్నా ఎంతమంచి ఆలోచనతో ఉన్నారో! మీ అందరూ మంచి మంచి వాళ్ళై మానవ సేవ సేస్తూ తోటివారికి, లేనివారికి సాయం చేసుకుంటూ, సమా జానికి మంచి చేస్తే అంతా సుఖ సంతోషాలతో ఉంటారు కదా! ఏం చదువు కున్నా , ఏవృత్తి చేసినా న్యాయంగా చేయాలి. గాంధీ మహాత్ముడు 'లాయరైనా. ఎన్నడూ ఆయన అసత్య వాదనలు చేయలేదు. ' మై ఎక్స్ పెరి మెంట్స్ విత్ ట్రూత్ ' అని న్యాయంగా, సత్యంగా 'అహింసో పరమో ధర్మః' అనే సూక్తులు పాటించి స్వతంత్ర్యం సాధించి 'జాతిపిత' గా నిలిచి పోయారు.మరి మీరంతా..." అంటున్న పంతులుగారి మాట పూర్తిచేయ కుండానే, పిల్లలంతా "పంతులుగారూ ! ఈ నూతన సంవత్సరం నుండీ మేము మానవతా విలువలు పాటిస్తామని ప్రమాణం చేస్తున్నాం, సత్య మార్గాన్నే అనుసరిస్తాం. ప్రామిస్!" అంటూ ఏక స్వరంతో అరిచారు.

# జనార్దన ఠాకూర్



## రాశి ఫలాలు

మార్చి నెలలో: రవి మాసారంభంలో కుంభ రాశిలో, తదుపరి 15 వ తేదీన మీన రాశిలో ప్రవేశం; కుజుడు ప్రారంభంలో మేషరాశిలో సంచారం, తదుపరి 22 నుంచి వృషభ రాశిలో ప్రవేశం; బుధుడు ప్రారంభంలో మీనరాశిలో సంచారం, మార్చి 6 న మీనరాశిలో సంచారం, మార్చి 11 వ తేదీన వక్రగతిలో సంచారం, మార్చి 28 న కుంభంలో వక్రత్యాగం; శుక్రుడు 21 వరకు మకరరాశిలోతదుపరి కుంభంలో; గురువు వృశ్చికరాశి లో, 29 వ తేదీన ధను రాశిలో ప్రవేశం; శని ధనస్సులో సంచారం; రాహువు 7వరకు కర్కాటకంలో తదుపరి మిథునంలో; కేతువు మార్చి 7 వరకు మకరంలో, తదుపరి ధనురాశిలో సంచారం

**మేష రాశి**: ఈమాసంలో ఆర్థికంగా సామాన్యంగా వుంటుంది. గృహంలోని పెద్దవారి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. గృహంలో శుభ కార్యాలు జరుగు అవకాశం కలదు. బంధుమిత్రులను కలుసుకుంటారు. ఉద్యోగస్తులకు ప్రయాణ అవకాశములు కలవు. వ్యాపారస్తులకు సామాన్యంగా ఉండును. విద్యార్థులు శ్రద్ధ వహించాలి. 24-27 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోండి.
వైదిక సూచన: 1. దత్తాత్రేయ స్తోత్ర పారాయణ శ్రేయస్కరం.

**వృషభరాశి**: ఈమాసంలో ఆర్థికంగా అనుకూలంగా వుంటుంది. అనవసర ఖర్చులు తగ్గించవలెను. ఆహార విషయంలో జాగ్రత్త అవసరం.మానసిక విచారం వలన ఉద్రేకానికి లోనయ్యే పరిస్థితులు ఉన్నవి. స్థాన చలన సూచన కలదు. బంధుమిత్రులతో తగాదా పడే అవకాశం కలదు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యత లేదా ప్రమోషన్ లభించు అవకాశం కలదు. వ్యాపారస్తులకు అనుకూలసమయం. 1-2 తేదీల మధ్య, మరల 27-29 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.
వైదిక సూచన: 1. లక్ష్మి గణపతి ఆరాధన శ్రేయస్కరం.

**మిథున రాశి**: ఈమాసంలో ఆర్థికంగా అనుకూలంగా వుంటుంది.పరులమాటలలో పడి మోసపోవు అవకాశం కలదు. స్వబుద్ధిని ఉపయోగించుట మంచిది. ఆరోగ్యము సామాన్యముగా ఉండును. అధికంగా శ్రమించు పనులు చేయరాదు. గృహంలో సుఖశాంతులు లభించును. వివాహప్రయత్నాలు లాభిస్తాయి. తీర్థయాత్రలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది. లీగల్ విషయాలపై శ్రద్ధ చూపవలెను. విద్యార్థులకు అనుకూలసమయం. 2-4 తేదీల మధ్య మరియు 29-31 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.
వైదిక సూచన: 1.శివారాధన శ్రేయస్కరం.

**కర్కాటక రాశి** : ఈమాసంలో ఆర్థికంగా అనుకూలంగా వుంటుంది. పెద్దలనుండి సంపద లభించుటకు అవకాశం కలదు. ఆరోగ్య విషయంపై శ్రద్ధ వహించాలి. ఉద్యోగస్తులకు అనుకూల సమయం కాదు. విద్యార్థులకు, ముఖ్యంగా పరిశోధనా రంగం లో ఉన్నవారికి మంచి సమయం. 4-7 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.
వైదిక సూచన: 1. నిత్యం సూర్యారాధన శ్రేయస్కరం

**సింహ రాశి**: ఈమాసంలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొందురు, అనారోగ్యం, అధిక కోపం మరియు వృధా ప్రయాణాలవలన ఇబ్బంది పడుదురు. బంధుమిత్రులతో బాంధవ్యాలు జాగ్రత్తగా వాడుకోవలెను. ఉద్యోగస్తులకు స్థలం మార్పునకు అవకాశము కలదు. వృత్తిరీత్యా చేయు ప్రయాణములు లాభించును. వ్యాపారంలో ఒడిదుడుకులకు అవకాశం కలదు. విద్యార్థులకు పై చదువులకు మంచి అవకాశం. 7-9 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. ఎర్రని పుష్పాలతో ఇష్ట దైవాన్ని పూజిస్తే శుభం.

**కన్యారాశి:** ఈమాసంలో ఆర్థిక విషయాలలో బాగుండును కాని అధిక ఖర్చుల వలన ఇబ్బంది పడుదురు. స్పెక్యులేషన్ వలన ఇబ్బంది కలుగును. ఆరోగ్య విషయంలో చిన్న సమస్యలు ఉండవచ్చును. గృహంలో కొంతమేర అశాంతి మరియు ముఖ్యమైన వ్యక్తి దూరం అయ్యే అవకాశం కలదు. ఉద్యోగస్తులకు పనిలో కొంతమేర అశాంతి వున్నా గుర్తింపు లభించును. వ్యాపారంలో ఉన్నవారికి న్యాయ సంబంధమైన చిక్కులు ఉండును. విద్యార్థులు చదువు మీద శ్రద్ధ చూపితే మంచి ఫలితాలు సాధిస్తారు. 9-12 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. దేవాలయంలో పాయసాన్ని పంచితే మేలు.

**తులా రాశి:** ఈమాసంలో ఆర్థికపరమైన చిక్కులు మరియు అధిక ఖర్చుల మూలంగా బాధపడు అవకాశం కలదు. ఆరోగ్య విషయంలో బాధపడువారికి కొంతమేర ఉపశమనం లభించును. ప్రతికూల పరిస్థితులను తెలివితో పరిష్కరించుకొనవలెను ఉద్యోగస్తులకు అనుకూలసమయం. మీ అధిక శ్రమకు గుర్తింపు లభించును. వ్యాపారస్తులకు అనుకూలసమయం. 12-14 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. నిత్యం ఇష్టదేవతా ప్రార్ధన చేయవలెను.

**వృశ్చిక రాశి :** ఈమాసంలో అధిక ఋణ ఒత్తిడి వలన అధికసమస్యలు ఆర్థికసమస్యలు ఉండును. ఇంట మరియు బయట సమస్యల వలన మానసిక శాంతి నశించును. ఉద్యోగస్తులకు పై అధికారుల వలన సమస్యలు కాని ఉద్యోగ ప్రయత్నములు ఫలించును. వ్యాపారస్తులకు పోటీదారుల వలన నష్టం కలుగు అవకాశం కలదు. 14-16 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. గోప్రదక్షిణ వలన శుభం కలుగును.

**ధను రాశి :** ఈమాసంలో ఆర్థిక అవసరములు తీరును. ఖర్చులు అధికం. జాగ్రత్త వహించవలెను. చిన్న చిన్న ప్రమాదములు కలుగవచ్చును. బయట వ్యక్తుల పరిచయము లభించును. ఉద్యోగస్తులకు పదవి యోగం కలదు. వ్యాపారస్తులకు కొంత అనుకూల సమయం కాదు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపవలెను. చిన్న చిన్న ప్రమాదములు జరుగవచ్చును. 16-18 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. దత్తాత్రేయ స్తోత్ర పారాయణ వలన మేలుజలుగును.

**మకర రాశి:** ఈమాసంలో ఆర్థిక ప్రణాళిక ఆవశ్యకం. గృహంలో అశాంతి మరియు అనుకోని సంఘటనల వలన మానసిక ఆందోళన ఉండును. మనస్సు ఆధ్యాత్మికత వైపు మళ్లించుట ఉత్తమం. అన్యుల ద్వారా మోసపోవు అవకాశం కలదు. ఉద్యోగస్తులు అతి జాగ్రత్త వహించవలెను. వ్యాపారస్తులు పనివారితో స్నేహపూర్వకంగా మెలగవలెను. 18-20 తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. శ్రీలక్ష్మి ఆరాధన సమస్యలను దూరం చేయును.

**కుంభ రాశి:** ఈమాసంలో ఆదాయంలో మార్పు లేదు కానీ నష్టంకు గురి అవుతారు. జాగ్రత్త వహించవలెను. మీయొక్క విపరీత ప్రవర్తన వలన నష్టం కలుగును. ఆరోగ్యం అనుకూలంగా ఉండును. ఉద్యోగస్తులు అత్యంత జాగ్రత్త వహించనిచో చిక్కులు ఎదుర్కొందురు. వ్యాపార విస్తరణకు అనుకూల సమయం. అనుకూ ల సమయం. 20-22 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చెయ్యండి.

**మీన రాశి :** అధిక వ్యయం వలన సతమతవుతారు. ఆరోగ్యవిషయంలో శ్రద్ధ వహించవలెను. ఉపయోగం లేని విషయాలలో తలదూర్చి అశాంతికి గురి అవుతారు. వృధా ప్రయాణాలు వుంటాయి. ఉద్యోగస్తులకు చేయు పనియందు ఆటంకాలు ఎదురౌతాయి. 22-24 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. సూర్య ఆరాధన వలన శుభ ఫలితాలు లభించును.

**సర్వే జనాః సుఖినో భవంతు**


# FORM - IV

| | | |
|---|---|---|
| 1. PLACE OF PUBLICATION | : | HYDERABAD, TELANGANA |
| 2. PERIODICITY OF PUBLICATION | : | MONTHLY |
| 3. PRINTER'S NAME | : | T. SHANTI |
| PRINTER'S NATIONALITY | : | INDIAN |
| PRINTER'S ADDRESS | : | 45058, JANAPRIYA UTOPIA<br>HYDERGUDA, ATTAPUR<br>HYDERABAD - 500 048 |
| 4. PUBLISHER'S NAME | : | T. SHANTI |
| PUBLISHER'S NATIONALITY | : | INDIAN |
| PUBLISHER'S ADDRESS | : | 45058, JANAPRIYA UTOPIA<br>HYDERGUDA, ATTAPUR<br>HYDERABAD - 500 048 |
| 5. EDITOR'S NAME | : | T. SHANTI |
| EDOTOR'S NATIONALITY | : | INDIAN |
| EDITOR'S ADDRESS | : | 45058, JANAPRIYA UTOPIA<br>HYDERGUDA, ATTAPUR<br>HYDERABAD - 500 048 |
| 6. NAME AND ADDRESS OF OWNER | : | T. SHANTI<br>45058, JANAPRIYA UTOPIA<br>HYDERGUDA, ATTAPUR<br>HYDERABAD - 500 048 |

I, T. SHANTI, HEREBY DECLARE THAT THE PARTICULARS GIVEN ABOVE ARE TRUE TO THE BEST OF MY KNOWLEDGE AND BELIEF.

01-03-2019 SD/-





RNI No. APTEL/2011/39497 MARCH 2019 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st March Date of Posting: 8th March



తెలంగాణ రాష్ట్ర నూతన మంత్రివర్గం

Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001